



# విజయభాను







విశాఖపట్నం, బుధవారం 22-07-2020 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 272 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## పారా మెడికల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికుల సేవలు భేష్

**మొబైల్ టెస్టింగ్ వ్యాన్‌ల ద్వారా కరోనా పరీక్షలను ఎక్కువ సంఖ్యలో నిర్వహించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషి అమోఘం**

**రాష్ట్రంలో కోవిడ్-19 స్థితిగతులపై ఏపీ గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ అధికారులతో సమీక్షా సమావేశం**




అమరావతి: రాష్ట్రంలో కోవిడ్-19 స్థితిగతులపై ఏపీ గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏపీ రాజ్‌భవన్ నుంచి ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నీ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డా.కెఎస్ జవహర్‌రెడ్డి ఇతర అధికారలతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ వివిధ కోవిడ్-19 రోగి చికిత్సలో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ఇతర అధికారుల కృషిని ప్రశంసించారు. లాక్‌డౌన్ తర్వాత కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 12 నుండి 13 శాతం వరకు పెరగడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్-19 పాజిటివ్ కేసులు ఎక్కువగా ఉన్న మొదటి ఐదు జిల్లాల గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ 5 జిల్లాల్లో వైరస్ వ్యాప్తి చెందకుండా నివారించడానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మొబైల్ టెస్టింగ్ వ్యాన్‌ల ద్వారా కరోనా పరీక్షలను ఎక్కువ సంఖ్యలో నిర్వహించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా గవర్నర్ ప్రశంసించారు. లాక్‌డౌన్ ప్రకటించిన తరువాత పొరుగు రాష్ట్రాల నుంచి ప్రజలు ఎక్కువ సంఖ్యలో రాష్ట్రానికి తరలిరావడమే పాజిటివ్ కేసుల సంఖ్య పెరగడానికి కారణమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నీ గవర్నర్‌కు వివరించారు. పాజిటివ్ కేసుల పెరుగుదలకు అనుగుణంగా తగిన సంఖ్యలో ఆసుపత్రిలో పడక గదులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రెండు వారాల తరువాత పాజిటివ్ కేసుల సంఖ్య రాష్ట్రంలో తగ్గుముఖం పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పాజిటివ్ కేసుల సంఖ్యను 5శాతానికి తగ్గించడానికి, మరణాల సంఖ్యను 1శాతం కంటే తక్కువగా ఉండేలా అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి తెలిపారు. టెస్టింగ్, ట్రేసింగ్, ట్రాకింగ్,

తరువాయి 2లో..

## అమూల్‌తో ఏపీ ప్రభుత్వం అవగాహన ఒప్పందం

**ప్రభుత్వ సహకార డెయిరీలకు మంచి రోజులు : సీఎం జగన్**



అమరావతి: రాష్ట్ర పరిశ్రమ రంగంలో మరో కీలక అడుగు పడింది. అమూల్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య, అమూల్ చెన్నై జోనల్‌హెడ్ రాజన్ సంతకాలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మేనేజింగ్ డైరెక్టర్‌తో సీఎం మాట్లాడారు.

ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ మహిళల జీవితాలను మార్చే క్రమంలో ఇదో గొప్ప అడుగు అన్నారు. వైఎస్సార్ చేయూత, ఆసరా కింద మహిళలకు రూ.11వేల కోట్లు సాయం చేశాం.

ప్రభుత్వ సహాయం మహిళల జీవితాలను మార్చేందుకు ఉపయోగపడాలని సీఎం ఆకాంక్షించారు. ప్రభుత్వ సహకార డెయిరీలకు మంచి రోజులు వచ్చాయని, దక్షిణాది రాష్ట్రాలకు గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు.

## నేడు ఏపీ మంత్రివర్గ విస్తరణ..

**రెండు ఖాళీ స్థానాలను భర్తీ చేయాలని సీఎం జగన్ నిర్ణయం**

అమరావతి: రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. నేడు మధ్యాహ్నం 1:29 నిముషాలకు మంత్రివర్గ విస్తరణ జరగనుంది. రెండు ఖాళీ స్థానాలను భర్తీ చేయాలని ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయిం చారు. కొత్త మంత్రులతో గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ ప్రమాణం చేయించనున్నారు. నేడు మధ్యాహ్నం ఒంటి గంటకు సీఎం వైఎస్ జగన్ రాజ్‌భవన్‌కు చేరుకోనున్నారు. రాజ్యసభకు ఎన్నికైనందున సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ తమ మంత్రి పదవులకు చేసిన రాజీనామాలను నిన్న గవర్నర్ బిశ్వభూషణ్ ఆమోదించిన సంగతి తెలిసిందే. వారు రాజీనామాలు చేసిన స్థానాల్లో కొత్త మంత్రులను నియమించనున్నారు.



## టెస్ట్‌లు పెంచుతాం.. కేసులు తగ్గిస్తాం!

**పాజిటివిటీ రేటు 5శాతానికి తగ్గించడమే లక్ష్యం**

**ఆరోగ్యశాఖ అధికారుల వెల్లడి**

ఢిల్లీ: ప్రపంచ దేశాలతో పోలిస్తే కరోనా మరణాలు భారత్‌లోనే తక్కువని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. మరణాల రేటు 2.43శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు. జాతీయ సగటు కంటే 30 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో కరోనా కేసులు తక్కువగా ఉన్నాయన్నారు. ప్రతి మిలియన్ జనాభాకు భారత్‌లో మరణాల రేటు 20.4గా ఉండగా.. ప్రపంచ సగటు 77గా ఉందని అధికారులు తెలిపారు. అలాగే, యూకేలో 667, అమెరికా 421, బ్రెజిల్ 371, మెక్సికో 302గా ఉందని వెల్లడించారు. అమెరికాలో అయితే మనకంటే 21రెట్లు, యూకేలో 33రెట్లు మరణాలు అధికమన్నారు.

**కేసులు తగ్గించేందుకు పరీక్షలు పెంచాలి**

కరోనా పాజిటివిటీ రేటును తగ్గించేందుకు కరోనా పరీక్షలు విస్తృతంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. కరోనా కేసులు తగ్గించడానికి పరీక్షలు పెంచాల్సిన అవసరం ఉంది. కరోనా కేసులు 5శాతం కంటే తక్కువకు చేరేందుకు పరీక్షలు పెంచాలన్నారు. 19 రాష్ట్రాల్లో 10లక్షల జనాభాకు రోజుకు 140కిపైగా పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు.

దేశంలో పాజిటివిటీ రేటును 5శాతం కంటే తక్కువగా తీసుకురావడమే లక్ష్యంగా పరీక్షల నిర్వహణలో ఇదే దూకుడుతో ముందుకెళ్తామని ఆరోగ్య మంత్రిత్వశాఖ ఓఎస్డీ రాజేష్ భూషణ్ తెలిపారు. ఈ రోజు వరకు దేశంలో పాజిటివిటీ రేటు 11.14శాతంగా ఉందన్న అధికారులు.. వారం క్రితం 10శాతంగా.. నాలుగు వారాల క్రితం 8 శాతంగా ఉండేదని వివరించారు.

నిన్నటి నుంచి ఈ రోజు ఉదయం 8గంటల వరకు దేశంలో 37,148 కొవిడ్ కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటివరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 11,55,191కి చేరింది. మొత్తం బాధితుల్లో 7,24,578మంది కోలుకోగా.. 28,084మంది ప్రాణాలు కోల్పోయారు. దేశంలో ప్రస్తుతం 4,02,529 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

## ఏపీలో 4944 మందికి కరోనా పాజిటివ్

అమరావతి: ఏపీలో కరోనా కేసుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఇవాళ ఒక్క రోజే 4944 మందికి కరోనా నిర్ధారణ అయ్యింది. దీంతో ఇప్పటి వరకు రాష్ట్రంలో నమోదైన కేసుల సంఖ్య 58,668కి చేరింది. పశ్చిమగోదావరిలో అత్యధికంగా 623 కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. మహమ్మారి కారణంగా ఇవాళ 62 మంది మృతి చెందగా..

ఇప్పటి వరకు ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 758కి చేరింది. తాజాగా తూర్పు గోదావరిలో 10 మంది, విశాఖపట్నంలో 9, చిత్తూరులో 8, శ్రీకాకుళంలో 7, అనంతపురంలో 6, పశ్చిమగోదావరిలో 6, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 5,, కర్నూలులో 4, కడపలో ఒక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు.ఇప్పటి వరకు 13,86,274 నమూనాలను పరీక్షించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

32,336 మంది వివిధ ఆస్పత్రులు, క్వారంటైన్ కేంద్రాల్లో చికిత్స పొందుతుండగా.. 25,574 మంది వైరస్ నుంచి కోలుకొని డిశ్చార్జ్ అయినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## నాలుగేళ్ల తర్వాత తల్లి చెంతకు కొడుకు



విజయవాడ: ఆపరేష్ ముస్కాన్ కోవిడ్-19 ఫేజ్ 6వ విడత ముగింపు కార్యక్రమం మంగళవారం డీజీపీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా డీజీపీ గౌతమ్ సవాంగ్ మాట్లాడుతూ.. 'గత ఐదు విడతల్లో జరిగిన ముస్కాన్ ఒక ఎత్తు. ఈ సారి జరిగిన ముస్కాన్ ఇంకో ఎత్తు. వారం రోజులు జరిగిన ముస్కాన్ కోవిడ్-19 ఎంతో సక్సెస్ సాధించింది. ఆపరేషన్ ముస్కాన్ బృందం పనితీరును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. వేలాదిమంది పిల్లలను రక్షించటం ఆనందాన్ని, తృప్తిని ఇస్తోంది. ఆపరేషన్ ముస్కాన్‌తో నాలుగేళ్ళ తర్వాత తల్లి దగ్గరకి కొడుకును చేర్చాము. కరోనా టెస్టుల ద్వారా చాలా మందిని కోవిడ్ నుంచి కాపాడగలిగాము. ఆపరేషన్ ముస్కాన్‌ను చాలెంజ్‌గా తీసుకొని పనిచేసిన సీఐడీకి అభినందనలు' అన్నారు. టెలికాన్ఫరెన్సు ద్వారా వివిధ జిల్లాలో రెస్క్యూ చేసిన పిల్లలు, వారి తల్లిదండ్రులతో గౌతమ్ సవాంగ్ మాట్లాడారు.

అంతేకాక సమన్వయంతో ముందుకు సాగి లక్ష్యాన్ని సాధించిన ముస్కాన్ బృందాలను డీజీపీ గౌతమ్ సవాంగ్ అభినందించారు. ఈ ఆపరేషన్ ద్వారా మొత్తం 4806 మందిని కాపాడామని తెలిపారు. బాల కార్మికులుగా ఉన్న 278 మంది పిల్లలను రక్షించామన్నారు. పట్టుబడ్డవారిలో 73 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తించామన్నారు. చిరునామా ఉన్న 4,703 మంది వీధి బాలలను తల్లిదండ్రులకు అప్పగించినట్లు గౌతమ్ సవాంగ్ తెలిపారు.

## సర్వదర్శన టోకెన్ల జారీ నిలిపివేసిన తితిదే

తిరుపతి: తిరుపతిలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతుండటంతో తిరుమల శ్రీవారి దర్శనాల సంఖ్యను తితిదే కుదిస్తోంది. ఇప్పటికే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కలిపి 12వేల టికెట్లు తితిదే జారీ చేస్తోంది. ఆన్‌లైన్‌లో ప్రత్యేక ప్రవేశదర్శనానికి 9వేల టికెట్లు, నేరుగా వచ్చి కొనుగోలు చేసేందుకు వీలుగా ఆఫ్‌లైన్ ద్వారా 3వేల టికెట్లను ఇప్పటి వరకు తితిదే జారీ చేసింది.

అయితే, తిరుపతి నగరంలో లాక్‌డౌన్ అమలవుతుండటంతో ఆఫ్‌లైన్ విధానంలో తిరుమల శ్రీవారి దర్శన టికెట్ల జారీని తితిదే నిలిపివేసింది. చిత్తూరు జిల్లాలో నమోదవుతున్న పాజిటివ్ కేసుల్లో 40శాతం తిరుపతిలో ఉండటంతో 48 డివిజన్లను కంటైన్‌మెంట్ జోన్ పరిధిలోకి చేర్చారు. సర్వదర్శనం

తరువాయి 2లో..

## బాబుది రాక్షసగుణం..

**మొసలి కన్నీరు కారుస్తున్నారు**

*దిశ చట్టం కోసం రూ.80కోట్లు.. 18 పోలీస్ స్టేషన్లు ఏర్పాటు*

*5.80 లక్షల మంది దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు*

**హోం మంత్రి మేకతోటి సుచరిత**



తాడేపల్లి: మహిళలకు సత్వర న్యాయం అందించడానికే దిశ చట్టాన్ని తీసుకొచ్చామని హోం మంత్రి మేకతోటి సుచరిత స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో ఎమ్మార్వో, ఎమ్మెల్యేపై దాడి చేస్తే కనీస చర్యలు లేవు. కానీ నేడు మహిళలకు ఏదో జరిగిపోతుందంటూ చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తున్నారంటూ ఆమె మండిపడ్డారు. దిశ చట్టాన్ని వక్రీకరించే విధంగా చంద్రబాబు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దిశ చట్టాన్ని అమలు చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.80కోట్లు కేటాయించారని.. 18 దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. అంతేకాక స్పెషల్ ఆఫీసర్లను నియమించామని... సిబ్బంది నియమాకాలకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్న

తరువాయి 2లో..




## పెట్రోలు, డీజిల్ పై వ్యాట్ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి

### - సిపిఎం

విశాఖపట్నం : రాష్ట్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ మీద వ్యాట్ పెంచింది. దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఈ కాలంలో అంతర్జాతీయంగా పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గుతున్నా ప్రతిరోజు పెట్రోలు డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ, రోడ్ సెస్సు వేసి ఒక్కొక్క లీటరుకు రూ.11 నుండి 12లు పెంచింది. కరోనా నేపథ్యంలో ఉపాధి లేక, వ్యాపారాలు సాగక ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఈ రకంగా భారాలు మోపి ప్రజల నడ్డివిరిచింది.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలు ఆందోళన చేసినా దానిని పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై పన్నులు వ్యాట్ పెంచడం అన్యాయం. ప్రజలపై భారాలు మోపే కేంద్ర ప్రభుత్వం యొక్క పన్నుల విధానాన్ని ఖండించాల్సిన రాష్ట్ర ప్రభుత్వమే ప్రజలమీద భారాలు మోపడం సరైంది కాదు.కేంద్ర ప్రభుత్వం ఒక ప్రక్క రాష్ట్రాల హక్కులు హరిస్తుంది. మరోవైపు రాష్ట్రానికి రావాల్సిన జిఎస్టీ నిధులు సకాలంలో ఇవ్వడం లేదు. ఇలాంటి తరుణంలో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై భారాలు మోపడాన్ని సిపిఎం ఖండిస్తున్నది.

## సరుకుల రవాణాలో ప్రజా రవాణా వ్యవస్థ

శ్రీకాకుళం : సరుకుల రవాణాలె ప్రజా రవాణా వ్యవస్థ అడుగులు ముందుకు వేస్తుందని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఏ.అప్పలరాజు తెలిపారు. వ్యాపారస్తులు, కష్టమర్ల సౌకర్యార్థం ప్రజా రవాణా వ్యవస్థ కార్గో సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీ చేస్తూ 5 వందల కిలోలకు మించి బరువు ఉన్న బల్క్ బుకింగ్స్ వస్తువులను ప్రైవేట్ రవాణా కంటే వేగంగా, భద్రంగా చేరవేయుటకు చర్యలు చేపట్టామన్నారు. పలాస నుంచి అనకాపల్లి వరకు తక్కువ ధరకే రవాణా జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు పలాసలో బయలుదేరి బుకింగ్ పాయింట్ వారీగా సరుకులు తీసుకోనున్నట్లు వెల్లడించారు. టెక్కలి, నర్సన్నపేట, శ్రీకాకుళం, రణస్థలం, పైడిభీమవరం, భోగాపురం, తగరపువలస, మధురవాడ, విశాఖపట్నం, కూర్మనపాలెం మీదగా కార్గో బస్సు అనకాపల్లి చేరుకుంటుందని చెప్పారు. తిరిగి అనకాపల్లి నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. రవాణా బుకింగ్ కోసం 7331147260, 9959225610 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవలసిందిగా ఆయన కోరారు.

## 9 నుండి 1 గంట వరకు బ్యాంకు సేవలు

శ్రీకాకుళం : జిల్లాలో అన్ని బ్యాంకులు మధ్యాహ్నం ఒంటి గంట వరకు పని చేయాలని జిల్లా బ్యాంకర్ల సమావేశంలో నిర్ణయించారు. జిల్లాలో కరోనా కేసులు అధికంగా వస్తుండటంతో బ్యాంకులు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పని చేయాలని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళ వారం కలెక్ట్ అద్యక్షతన జరిగిన డి.ఎల్.ఆర్, సమావేశంలో నిర్ణయించారు. వినియోగ దారులకు సేవలు అందించే బ్యాంకు బ్రాంచీలతోపాటు, పరిపాలనా కార్యాలయాలు కూడా మధ్యాహ్నం ఒంటి గంట తరువాత వినియోగదారుల సేవలు ముగించి, బ్యాంకు పనులు మధ్యాహ్నం 1.30 లోగా ముగించి తలుపులు వేయాలని నిర్ణయించారు. కరోనా వైరస్ నివారణలో భాగంగా నిర్ణయించడం జరిగిందని ఎల్.డి.ఎం జివిబిడి హరి ప్రసాద్ తెలిపారు.

## ఆగష్టు 5న సిపెట్ జెఇఇ



శ్రీకాకుళం : ప్లాస్టిక్ రంగంలో డిప్లమో, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో కోర్సులలో చేరుటకు ఆగష్టు 5వ తేదీన ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగు అండ్ టెక్నాలజీ (CIPET) విజయవాడ కేంద్రం మేనేజర్ చింతా శేఖర్ తెలిపారు. సిపెట్ కేంద్ర ప్రభుత్వ రసాయన, ఎరువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచుటలో శిక్షణ ఇస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ డిప్లమో ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ క్నాలజీ, డిప్లమో ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగు అండ్ టెస్టింగు కోర్సులను నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఈ కోర్సులకు ప్లాస్టిక్ మరియు అనుబంధ సంస్థలు క్యాంపస్ ఎంపిక ద్వారా దేశ, విదేశాలలో ప్లాస్టిక్ వస్తువుల తయారి, మౌల్డింగు, టెస్టింగు మరియు క్వాలిటీ నిర్ధారణ రంగాల్లో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. 3 సంవత్సరాల వ్యవధిగల డిప్లమో ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ క్నాలజీ, డిప్లమో ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీలో చేరుటకు 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. 2 సంవత్సరాల వ్యవధి గల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగు అండ్ టెస్టింగు కోర్సుకు సైన్స్ సబ్జెక్టుతో డిగ్రీ అర్హత కలిగిన విద్యార్థులు అర్హులని చెప్పారు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు ఎస్.సి, ఎస్.టిలు రూ.3 వందలు, ఇతరులు రూ.750 నెట్ బ్యాంకింగు, ఛలాను ద్వారా చెల్లించవచ్చని వివరించారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు https://eadmission.cipet.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తులు జూలై 31వ తేదీలోగా సమర్పించాలని చెప్పారు. కోర్సులలో చేరుటకు సిపెట్ జాయింట్ ఎంట్రన్స్ పరీక్ష (సిపెట్ జెఇఇ) పరీక్షలో అర్హత సాధించాలని శేఖర్ పేర్కొన్నారు. సిపెట్ జెఇఇ పరీక్షకు ఈ నెల 31వ తేదీ లోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేయాలని సూచించారు. అడ్మినిషన్ కార్డులను ఈ నెల 25వ తేదీ నుండి డౌన్ లోడ్ చేసుకునే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

ఆగష్టు 5వ తేదీన ఆన్ లైన్ ద్వారా ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విజయవాడ, విశాఖపట్నం, అనంతపురంలలో ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన అభ్యర్థులు వివరాలకు బి.కిరణ్ కుమార్ (99859 41979)కు సంప్రదించవచ్చుని, సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని ఆయన వివరించారు.

## శిరోముండనం ఘటనపై డీజీపీ తీవ్ర ఆగ్రహం



సీతానగరం: తూర్పుగోదావరి జిల్లా సీతా నగరంలో పోలీస్టేషన్‌లో యువకుడి శిరోముండనం ఘటనపై ఏపీ డీజీపీ గౌతమ్ సవాంగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తి విచారణకు ఆదేశించారు. ఇలాంటి వ్యవహారశైలిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. స్థానిక వైకాపా నాయకుడి అనుచరుడి ఫిర్యాదు మేరకు వెదుళ్లపల్లిలో వరప్రసాద్ అనే ఎస్సీ యువకుడిని ఆరెస్టు చేసి సీతానగరం పోలీసులు తీవ్రంగా కొట్టిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా అతడికి శిరోముండనం చేశారు. తీవ్రగాయాల పాలైన అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇది రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో అధికారులు ఇన్ ఛార్జి ఎస్సైతోపాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లపై కేసు నమోదు చేశారు.

ఇసుక లారీలు అడ్డుకున్నందుకు తనపై దాడి చేశారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. ఇసుక లారీలను ఆపిన సమయంలో స్థానిక మునికూడలి వద్ద వైకాపా నాయకుడు కవల కృష్ణమూర్తి కారుతో వచ్చి ఢీ కొట్టినట్లు బాధితుడు చెబుతున్నాడు.వెదుళ్ల పల్లిలోని బాధితుడు వరప్రసాద్ ఇంటికి వెళ్లి కోరుకొండ డీఎస్పీ విచారణ చేపట్టారు. పోలీసుల తీరును నిరసిస్తూ ఎస్సీ, ఎస్టీ సంఘాలు ఆందోళన చేపట్టాయి.

## అమరావతి పోరాటం మరింత ఉద్ధృతం

### చంద్రబాబు

అమరావతి: ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెదేపా అధినేత చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజవర్గాల తెదేపా ఇన్ఛార్జిలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అమరావతి రాజధాని తరలిపోకుండా ఏమి చేయాలో అన్నీ చేశామని, ఇంకా పోరాటాలను మరింత ఉద్ధృతం చేయాలని కోరారు. అన్ని రాష్ట్రాలకంటే ఏపీనే ఎక్కువ అప్పులు చేసిందని చంద్రబాబు గుర్తు చేశారు. న్యాయమూర్తిపై దాడి చేసింది మంత్రి అనుచరులేనని ఆరోపించారు. సీఎం అసమర్థత వల్ల కరోనా కేసులు పెరిగిపోతున్నాయని విమర్శించారు. ఇంతవరకు సీఎం జగన్ మాస్కు ధరించలేదని చెబుతూ.. ఆయనే ధరించకుండా మాస్కు లేకపోతే జరిమానా అనడం ఎంత వరకు సమంజసమని చంద్రబాబు ప్రశ్నించారు.

## మాజీ ఎమ్మెల్యే జనార్ధన్ తాట్రాజ్ మృతిపట్ల మంత్రి కృష్ణదాస్ సంతాపం



శ్రీకాకుళం : విజయనగరం జిల్లా కురుపాం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వి.టి. జనార్ధన్ తాట్రాజ్ ఆకస్మిక మృతి పట్ల మంత్రి ధర్మాన కృష్ణదాస్ సంతాపం వెలిబుచ్చారు. తాట్రాజ్ గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మంత్రి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ తనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 2009-14 మధ్య తామిద్దరూ సహచర ఎమ్మెల్యేలుగా ఉన్నామని, పార్టీలు వేరైనా పక్క, పక్క జిల్లాలు కావడంతో పలు అంశాలపై తామిద్దరూ చర్చించుకునే వాళ్ళమని అన్నారు. చిన్న వయసులోనే ఆయన మృతి చెందడం వారి కుటుంబానికి తీరనిలోటని ఈ సందర్భంగా మంత్రి కృష్ణ దాస్ మంగళవారం సాయంత్రం విడుదల చేసిన ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

## బీజేపీ నేతలపై మల్లాది విష్ణు ఫైర్




విజయవాడ: అమ్మఒడి నిధులకు సంబంధించి బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలపై బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ మల్లాది విష్ణు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'అమ్మఒడి నిధులపై రాష్ట్ర బీజేపీ నేతల ఆరోపణలు సరికాదు. పరిజ్ఞాన లోపంతో కన్నా లక్ష్మీనారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేస్తున్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌లోని అమ్మఒడి లబ్దిదారులకి రాష్ట్ర బడ్జెట్ నుంచే నిధులు కేటాయించారు. ఆలయాల హుండీలు, భక్తుల కానుకల నుంచి నిధులిచ్చారనటం అవివేకం.

బ్రాహ్మణ కార్పొరేషన్ దేవాదాయ శాఖలో భాగం అయినంత మాత్రాన నిందలు సరికాదు. సమగ్ర సమాచారం తెలుసుకొని మాట్లాడితే గౌరవంగా ఉంటుంది. అరకొర సమాచారంతో మాట్లాడి అభాసుపాలై మరోసారి పరువు పోగొట్టుకోవద్దు' అంటూ బీజేపీ నాయకులకు మల్లాది విష్ణు సూచించారు.

## కరోనా విజృంభిస్తున్న వేళ... వ్యాపారస్తులు సమయపాలన తప్పనిసరి

పరవాడ : ప్రస్తుతం కరోనా వైరస్ విజృంభిస్తున్న కారణంగా పరవాడ గ్రామంలో ఉన్న వ్యాపారం అందరు సమయపాలన పాటించాలనీ పంచాయితీకార్యదర్శి అచ్యుతరావు మంగళవారంఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 6 .00గంటల నుండి 11.00గంటల వరకు మాత్రమే వ్యాపారాలు నిర్వహించాలనీ, వ్యాపారస్తులుఅందరూ దీనికిసహకరించాలనీ ఈసందర్భంగా అయన కోరారు.

## నిమ్స్ నుంచి ఇద్దరు వాలంటీర్లు డిశ్చార్జ్



హైదరాబాద్: స్వదేశీ ఫార్మా దిగ్గజం భారత్ బయోటెక్ రూపొందించిన కోవాగ్జిన్ క్లినికల్ ట్రయల్స్ కొనసాగుతున్నాయి. సోమవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో ఇద్దరు వాలంటీర్లకు ఈ వాక్సిన్‌ను ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వారిద్దరి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. వారిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. 14 రోజులపాటు వాలంటీర్ల ఆరోగ్యాన్ని పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత మళ్లీ ఆసుపత్రికి తీసుకువచ్చి రక్త నమూనాలను సేకరించి పరీక్షిస్తారు. టీకాలోని అచేతన (అన్‌యాక్టివేటెడ్) వైరస్ వల్ల శరీరంలో యాంటీబాడీలు ఏ మేరకు వృద్ధి చెందాయి, సమస్యలు ఏమైనా ఉన్నాయా పరిశీలిస్తారు. అంతా సక్రమంగా ఉంటే రెండో డోసు టీకా అందిస్తారు. మొత్తం 60 మందిపై టీకా పరీక్షలు చేయనున్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## పారా మెడికల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు సేవలు భేష్

ఐసోలేషన్‌లతో పాటు చికిత్స పద్ధతిని అనుసరించి కరోనా ఉధృతిని తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అని ఆయన తెలిపారు. 24 గంటల్లో ఫలితం లభించేలా కరోనా పరీక్ష లేబరేటరీల పనితీరును క్రమబద్ధీకరిస్తున్నామన్నారు. ప్రజలు 104 కాల్ సెంటర్‌కు కాల్ చేసి పరీక్ష చేయించుకోవచ్చని, కాల్ సెంటర్ ద్వారా కోవిడ్ -19 పాజిటివ్ రోగులు ఆసుపత్రులలో అడ్మిషన్ కూడా పొందవచ్చని జవహర్ రెడ్డి అన్నారు. 15 - 20 నిమిషాల్లో ఫలితాన్ని ఇవ్వగల 3.25 లక్షల రాపిడ్ యాంటిజెన్ టెస్ట్ కిట్లను రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తోందని, పరీక్షలను కూడా రోజుకు 35000 - 40000 వరకు పెంచడానికి కృషి చేస్తున్నామని గవర్నర్‌కు తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో ఫేస్ మాస్క్ ధరించడం ప్రభుత్వం ఇప్పుడు తప్పనిసరి చేసిందని ఆయన వెల్లడించారు. ప్రత్యేక కోవిడ్ -19 రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి ప్రభుత్వం 2700 మంది వైద్యులను, పారా మెడికల్ సిబ్బందిని నియమించినట్లు జవహర్ రెడ్డి గవర్నర్‌కు తెలిపారు.

## బాబుది రాక్షసగుణం..

చంద్రబాబు ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు సుచరిత.

ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 5.80 లక్షల మంది దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని సుచరిత తెలిపారు. దిశ చట్టానికి 71,700 ఫిర్యాదులు వచ్చాయని.. 53 వేలకు పైగా మంది ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారని తెలిపారు. మహిళలపై నేరం చేసిన వారిని కఠినంగా శిక్షించేందుకే దిశ చట్టం చేశామన్నారు. దిశ చట్టం తెచ్చాక గతంతో పోల్చితే మహిళలపై అఘాయిత్యాలు తగ్గాయన్నారు. దిశ చట్టాన్ని మరింత కఠినంగా అమలు చేస్తున్నామన్నారు. నేరస్తులకు శిక్ష పడటం సహా నేరాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని సుచరిత ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రబాబుది రాక్షస గుణం.. ఆయన కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ పిల్లలకు ఇంగ్లీష్ మీడియం అందించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. బాబు అడ్డుకుంటున్నాడని ఆమె తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమీషనర్ గా దళితుడిని నియమిస్తే అడ్డుకున్నారన్నారు సుచరిత. విజయవాడలో అంబేద్కర్ విగ్రహన్ని ఏర్పాటు చేస్తుంటే.. దానిపై కూడా విమర్శలు చేస్తున్నారని సుచరిత మండిపడ్డారు. దళితులుగా ఏవరైనా పుడతారా అని వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు.. ఇప్పటి వరకు క్షమాపణ చెప్పలేదని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి 82.5 శాతం ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీలకు అవకాశం కల్పించామన్నారు. మొదటి బడ్జెట్‌లోనే ఎస్టీ, ఎస్సీ, మైనారిటీ, బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లు తెచ్చామని తెలిపారు. భారత దేశంలోనే ఓ దళిత మహిళను హెూంమంత్రి చేయాలని ఎవరు ఆలోచన చేయలేదు. కానీ సీఎం జగన్ ఓ దళిత మహిళను హెూంమంత్రిని చేశారని సుచరిత తెలిపారు. గత ప్రభుత్వాలు మేనిఫెస్టోను అమలు చేయలేదు.. కానీ సీఎం జగన్ ముందుగా డేట్ ప్రకటించి మరీ సంక్షమ పథకాలు అమలు చేస్తున్నారని సుచరిత ప్రశంసించారు. ముఖ్యమంత్రి సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించారని తెలిపారు. సీఎం తీసుకున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్నయన్నారు సుచరిత.

## సర్వదర్శన టోకెన్ల జారీ నిలిపివేసిన తితిదే

టికెట్లు జారీ చేసే భూదేవి కాంప్లెక్స్ లాక్‌డౌన్ పరిధిలోకి రావడంతో తితిదే టికెట్ల జారీ నిలిపివేసింది. తితిదే ఉద్యోగులు, అర్చకులు అధిక సంఖ్యలో కరోనా వైరస్ బారిన పడుతుండటంతో దర్శనాల సంఖ్య తగ్గించడంతో పాటు దర్శనాలపై తితిదే సమీక్ష నిర్వహిస్తోంది. తిరుపతిలో కేసులు పెరుగుదల, తితిదే సిబ్బందికి వైరస్ సోకడం వంటి అంశాలతో రాష్ట్ర ప్రభుత్వానికి తితిదే నివేదిక సమర్పించింది. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా దర్శనాల కొనసాగింపుపై తితిదే నిర్ణయం తీసుకోనుంది.

## వ్యాట్ పేరుతో రాష్ట్ర ఖజానా నింపుకోవాలని ప్రయత్నించడం తీవ్రమైన ఆక్షేపం



విశాఖపట్నం : కరోనావైరస్ వల్ల ప్రజలు గడిచిన 4నెలలుగా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మానవత్వాన్ని మరిచి డీజిల్ మరియు పెట్రోల్ పై పన్నులు పెంచి వ్యాట్ పేరుతో రాష్ట్ర ఖజానా నింపుకోవాలని ప్రయత్నించడం తీవ్రమైన ఆక్షేపనియమని ప్రభుత్వానికి ప్రజలపై ఏ మాత్రం గౌరవం ఉన్నా పెంచిన వ్యాట్ (పన్నులు) తక్షణమే తగ్గించాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో పెట్రోల్ మరియు డీజిల్ పై మంగళవారం జరిగిన సమావేశంలో పెరిగిన నాలుగు రూపాయల పన్ను భారాన్ని నిరసిస్తూ ఆందోళన కార్యక్రమం జరిగింది. గడిచిన ఎన్నికల్లోలి తాము అధికారంలోకి వచ్చిన మరుక్షణం ప్రజల పై ఎటువంటి భారం వేయమని అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం మద్యం మరియు పెట్రోల్, డీజిల్‌లి పై పన్నులు విధిస్తూ సుమారు లిపది వేల కోట్ల రూపాయలులి అన్యాయంగా దోపిడీ చేస్తున్నారని అన్నాడు.

కరోనాలి కష్టకాలంలో ఉన్న ప్రజలను దోపిడీ చేస్తున్న జగన్ మోహన్ రెడ్డిలి ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలందరూ నిలదీయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ప్రసాధుల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లో గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పులి వెంకటరమణ రెడ్డి, ఎసీ సెల్ అధ్యక్షులు పుచ్చా విజయ కుమార్, సీనియర్ టీడీపీ నాయకులు బెల్లంకొండ రాజనారాజు, కళ్ళేపల్లి శ్రీనివాసవర్మ, మరియు...

వార్డు అధ్యక్షులు బోండా జగన్, గోమాడ వాసు,వియ్యపు కొండబాబు, సీరం రాజేష్, ఎసీ సెల్ జిల్లా నాయకులు చెరుకూరి నాగేశ్వరరావు, మహిళ నాయకులు కాటూరి జయలత, రెట్టి వాసు, స్టీల్ టిఎన్‌టియుసి అధ్యక్షులు నమ్మి సింహాద్రి, కదిరి పోలరాజు, తెలుగుయువత నాయకులు నక్కా సింహాచలం, కొల్లి నాగేశ్వరరావు, జగదీష్, పరిటాల శ్రీనివాస్, దొమ్మేటి అప్పారావు. ఈ కార్యక్రమానికి వందన సమర్పణ సీనియర్ నాయకులు పంచదార్ల ఉగ్రం చేశారు.

## కోవిడ్‌కు అత్యంత చవకైన ట్యాబ్లెట్ ఇదే!

న్యూఢిల్లీ: కరోనా బాధితులకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న మందులన్నింటిలో ఫాబిఫ్లూ మెడిసిన్ అత్యంత చవకైందని ముంబై కేంద్రంగా పనిచేసే గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్ కేంద్రానికి తెలిపింది. భారత్‌లోనే కాకుండా విదేశాల్లో సైతం మిగతా కోవిడ్ మందులతో పోల్చుకుంటే ఫాబిఫ్లూ తక్కు ధర అని గ్లెన్‌మార్క్ కేంద్రానికి వివరించింది. ఇతర కోవిడ్ మందులు రెమ్డెసివిర్, టాసిలీజుమాబ్, ఇతోలిజుమాబ్ ధరలు ఫాబిఫ్లూ కంటే మూడు నుంచి ఐదు రెట్లు అధికమని కంపెనీ వాదించింది. ఫాబిఫ్లూ ధరలు, దాని పనితీరుపై కొన్ని విమర్శలు రావడంతో కేంద్రం గ్లెన్‌మార్క్‌ను వివరణ కోరగా ఈ మేరకు సదరు ఫార్మాస్యూటికల్ స్పందించింది. ఫాబిఫ్లూ ధర సామాన్యులకు సైతం అందుబాటులో ఉందని వివరణ ఇచ్చింది. కాగా, గత నెలలో గ్లెన్‌మార్క్ కోవిడ్ చికిత్సలో పనిచేసే యాంటి వైరల్ ఔషదం ఫవిపిరవిర్‌ను ఫాబిఫ్లూ పేరుతో మార్కెట్లోకి తెచ్చింది. రూ.103 కు ఒక ట్యాబ్లెట్ చొప్పున ధర నిర్ణయించింది. కోవిడ్ నుంచి కోలుకునేందుకు రెండు వారాలపాటు ఈ మెడిసిన్ వాడాల్సి ఉంటుందని కంపెనీ తెలిపింది.


అంటే కోర్సు పూర్తయ్యే సరికి రూ.12,500 వ్యయం అవుతుంది. అయితే, ఫవిపిరవిర్ శ్వాస సంబంధ వ్యాధులు ఉన్న కోవిడ్ బాధితులపై సరిగా పనిచేయడం లేదనే వార్తలు వెలువడ్డాయి. దాంతోపాటు ధరలు కూడా అధికంగా ఉన్నాయనే విమర్శలు కూడా వచ్చాయి.

దీంతో వివరణ ఇవ్వాలని కేంద్రం గ్లెన్ మార్క్‌కు నోటీసులు పంపింది. ఇదిలాఉండగా.. గత వారం గ్లెన్‌మార్క్ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ట్యాబ్లెట్లపై ధరను 27 శాతం ధర తగ్గించింది. దాంతో ఒక్కో ట్యాబ్లెట ధర రూ.75 కు చేరింది.

## 35వవార్డు అధ్యక్షులు అలుపన కనకరెడ్డి ఆధ్వర్యంలో
# వాలంటరీలకు, ప్రజలకు ఉచిత కోవిడ్-19 టెస్టులు



విశాఖపట్నం : విశాఖ దక్షిణ నియోజకవర్గం 35వ వార్డు ప్రసాద్ గార్డెన్ పరిధిలో ఉన్న ముఖ్య మంత్రి ఆరోగ్య కేంద్రం వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, 35వ వార్డు. అధ్యక్షులు, కార్పొరేటర్ అభ్యర్థి అలుపన కనకరెడ్డి ఆధ్వర్యంలో వార్డు వాలంటరీ లకు, వార్డులో ఉన్న ప్రజలకు ఉచితంగా కోవిడ్-19 టెస్టులు చేయించడం జరిగినది. ఇందులో భాగంగా ముందుగా వార్డు అధ్యక్షులు కార్పొరేటర్ అభ్యర్థి అయినటువంటి, అలుపన కనకరెడ్డి కూడా కోవిడ్-19 టెస్ట్ చేయించుకోవడం జరిగింది. ఈ యొక్క టెస్ట్ లో నెగిటివ్ అని రిపోర్ట్ వచ్చింది ఇదే సందర్భంలో ఈ కార్యక్రమంనకు వచ్చిన వారందరికీ కనకరెడ్డి శాని టైజర్ లు పంచడం జరిగినది.



## జివియంసి సిబ్బందికి శానిటైజర్స్, బాటిల్స్ వితరణ




విశాఖపట్నం : రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ఆధ్వర్యంలో మంగళవారం నాడు 500 మందికి , శానిటైజర్ బాటిల్స్, గుడ్డ మాస్కులు, చేతి గ్లౌజ్‌లు జీ వి ఎం సి కార్యాలయములో జి వి ఎం సి అసిస్టెంట్ కమీషనర్ (ఆర్థిక) జోన్-3 శ్రీమతి రాజ్య లక్ష్మి గారికి అందజేయడం జరిగింది. గడచిన నాలుగు నెలల నుండి జి వి ఎం సి సిబ్బంది 24 7 ప్రాతిపదికన పారిశుధ్య సిబ్బంది మరియు ఆశావర్కర్లు , అధికారులు సమాజానికి ఎంతో సేవ చేస్తున్నారు. వారికి రోటేరియన్ కంకటాల మల్లిక్ మరియు రోటేరియన్ శిల్ప వారి సౌజన్యంతో రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ వారు వెన్ను దన్నుగా నిలబడి ఈ చిరుకానుకను అందజేశారు. ముందు ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు నగరంలో చేపడతామని 2020-2021 సంవత్సరానికి కొత్తగా ఎన్నిక కాబడిన క్లబ్ అధ్యక్షులు రోటేరియన్ జి సత్యనారాయణ రెడ్డి తెలియజేసారు.

## కన్యకాపరమేశ్వరి ఆలయం లో
# శ్రావణమాస పూజలు




విశాఖపట్టణం : వన్ టౌన్ ప్రాంతంలో కురుపాం మార్కెట్ ప్రాంతంలో వున్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం లో శ్రావణమాస పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కరోనా కలకలం సృష్టిస్తున్న వేళ, ప్రభుత్వ నిబందనలకను గుణంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఈ సంవత్సరం శ్రావణమాసంలో వచ్చే నాలుగు శుక్రవారాల్లో అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్గించ నున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం మహిళలచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించడం లేదని, భక్తులందరు పూజా కార్యక్రమాలు తమ ఇళ్ళలోనే నిర్వహించుకుని అమ్మవారి దర్శన నిమిత్తం మాస్క్ ధరించి మాత్రమే ఆలయానికి రావాలని భక్తులను కోరారు. లిశ్రావణమాసం లో వచ్చే నాలుగు శు క్రవారాల్లో తమ గోత్ర నామాలతో పరోక్షంగా పూజ జరిపించు కోవటానికి 316/- రూపాయలు దేవాలయంలో చెల్లించాలని అన్నారులి. ప్రతీ శు క్రవారం ఆలయ ప్రాంగణం యావత్తూ భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో వంచుకుని శానిటైజేషన్ చేయనున్నట్లు, భక్తులు సామాజిక దూరం పాటించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా మొదటి శుక్రవారం అమ్మవారిని ముత్యాలచీర అలంకరణ, రెండవ శుక్రవారం బంగారు చీర అలంకరణ, మూడో శుక్రవారం వెండిచీర అలంకరణ మరియు నాల్గవ శుక్రవారం నాడు అమ్మవారిని ప్రత్యేక అలంకరణ వుంటుందని అన్నారు.ఈ శ్రావణ మాసం ఉత్సవాల్లో మహిళలు కోవిడ్ నిభందనలకనుగుణంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని వారి అనుగ్రహపాత్రులుకమ్మని కోరారు.

## పెట్రోల్, డీజిల్ పై రేట్లు పెంచడం
# సామాన్యుల నడ్డి విరచడమే : గంటా నూకరాజు



భీమునిపట్నం : పెట్రోల్, డీజిల్ పై రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ విధించడం సామాన్యుల నడ్డి విరచడమే ననీ భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గంటా నూకరాజు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశంలో మాట్లాడుతూ గత నాలుగు నెల లుగా కరోనా కారణంగా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొం టున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ఈ విధంగా భారం మోపడం సరైనది కాదని అన్నారు. ఇప్పటికే పెంచుతున్న చార్జీల మోతతో జనజీవనం అల్లాడు తుంటే వ్యాట్, అదనపు వ్యాట్ అని ప్రజలను బెంబేలెత్తిస్తున్నారని చెప్పారు. వ్యాట్ పెంచుతూ నిర్ణయం తీసుకుందని, ప్రభుత్వం అదనంగా మోపిన భారం, మత్స్య కారులు, ద్విచక్ర వాహనాల మీద వ్యాపారం చేసుకొనే చిల్లర వర్తకులు, రైతులు అందరికి పెనుభారమని అన్నారు.

## ప్రభుత్వ మద్యం దుకాణాల దగ్గర జరిగే పరిణామాలు పై వినతి పత్రం సమర్పణ




విశాఖసిటీ : బీజేపీ దళం మరియు జనసేన సైన్యం కలిసి మంగళవారం ప్రభుత్వ మద్యం దుకాణాల దగ్గర జరిగే పరిణామాలు పై వినతి పత్రం సమర్పించడం జరిగింది. రోజురోజుకీ పెరుగుతున్నటువంటి కరోనా మహమ్మారిలో భాగంగా మంగళవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌ని మరియు అసిస్టెంట్ కమిషనర్‌ని కలిసి ప్రభుత్వ మద్యం దుకాణాలు వ్యక్తిగత దూరం పాటించకుండా కనీసం మొహానికి మాస్కులు లేకుండా సామాజిక భద్రత లేకుండా కరోనా నియమ నిబంధనలు పాటించకుండా ఉన్నటువంటి ప్రభుత్వ మద్యం దుకాణాలు పర్యవేక్షించి వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అలాగే కంటోన్మెంట్ జోన్ లో ఉన్నటువంటి మద్యం దుకాణాల కోసం ప్రజా శ్రేయస్సు సామాజిక శ్రేయస్సు కోసం ప్రజా ఆరోగ్యంను దృష్టిలో ఉంచుకొని కొన్ని మార్పులు చేయాలని వారికి సూచనలు ఇచ్చి కొన్ని మార్పులు చేయాలని భారతీయ జనతా పార్టీ మరియు జనసేన కలసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది వెంటనే కమిషనర్ స్పందించి చర్యలు మార్పులు తీసుకుంటామని చెప్పారు. భారతీయ జనతా యువ మోర్చా విశాఖ నగర అధ్యక్షులు విజయశంకరఫణి, కోరాడ అప్పారావు మరియు కొణతాల శ్రీనివాసరావు, సంజీవ్‌రావు, కోరాడ శంకర్, పార్వతి, మాధవి, గొర్లె రామునాయుడు, జనసేన ఉత్తరాంధ్ర నాయకులు పంచకర్ల సందీప్, మరియు జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నాము.



# పోర్టు కార్మికులకు న్యాయం చేయండి
## క్యాజువల్స్‌కు పని వేతనం కల్పించండి
## కేంద్రమంత్రి తో ఎంపీ ఎంవివి



విశాఖపట్నం : విశాఖ పోర్ట్ ట్రస్ట్ లో గత 12 ఏళ్లుగా సేవలందిస్తున్న క్యాజువల్ కార్మికులకు న్యాయం చేయాలని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కోరారు..ఈ మేరకు మంగళవారం కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి ఎం. మాండవీయ దృష్టికి పలు పెండింగ్ అంశాలను ఎంపీ తీసుకువెళ్లారు,,, కారుణ్య నియామకాల కింద 12 ఏళ్ల క్రితం ఉద్యోగంలో చేరిన 347 క్యాజువల్ కార్మికులకు నేటికీ సరైన పనిలేకుండా నానా అవస్థలు పడుతున్నారని మంత్రి కి తాజాగా తెలియజేశారు..

.. డి ఎల్ బి నుంచి వీరంతా పోర్ట్ లో విలీనం ఐయ్యారని ఐతే ఏళ్లు గడుస్తున్నా నేటికీ వీరికి సరైన పని లేకుండా పోవడం వల్ల కుటుంబంలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మంత్రికి నివేదించారు.. ,,తక్షణమే పోర్టులో ఖాళీగా ఉన్న పనులకు వీరిని వినియోగించుకోవాలని కేంద్రమంత్రి ని కోరినట్లు ఎంవీవీ చెప్పారు , ఇందుకు కేంద్ర మంత్రి కూడా సానుకూలంగా స్పందించారని అన్ని విషయాలు తాజాగా లేఖ ద్వారా కూడా తెలియచేశామన్నారు.. , త్వరలోనే వీరి సమస్యకు పరిష్కారం చూపిస్తామని కేంద్ర మంత్రి ఇప్పటికే హామీ ఇచ్చినట్లు ఎంపీ ఎంవీవీ తెలిపారు,,,పోర్ట్ క్యాజువల్ కార్మికుల కోసం చైర్మన్ కె రామ్మోహన్ రావు.. డిప్యూటీ చైర్మన్ హరినాథ్ లతో కూడా చర్చించినట్లు ఎంపీ ఎంవీవీ చెప్పారు,,, ఈ సందర్భంగా ఎంపీ ని కార్మిక సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.. ఈ కార్యక్రమంలో విశాఖ పోర్ట్ ట్రస్ట్ మాజీ సలహాదారు,,, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి,, వైజాగ్ జర్నలిస్టుల ఫోరం, అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు,, క్యాజువల్ కార్మికుల సంఘం ప్రతినిధులు శ్రీనివాస్ వర్మ.. గోపి..కృష్ణ , ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

## కంటెన్మెంట్ జోన్ పరిధిలో మద్యం అమ్మకాలు

భీమునిపట్నం : కంటెన్మెంట్ జోన్ పరిధిలో లో షాపులన్నీ మూసివేసినా మద్యం దుకాణాలు తీసి అమ్మకాలు జరుగుతున్నా అధికారులు పట్టించు కోవడం లేదని, కరోనా వచ్చిన ఏరియాలో అతి సమీపంలో ఉన్న షాపులలో ఎలా విక్రయిస్తారని ప్రజలు అనుకుంటున్నారు.


**ఉత్తర రైల్వే**

**టెండరు ప్రకటన**

చీఫ్ ఇంజనీర్/టిఎమ్‌సి, ఉత్తర రైల్వే, హెడ్ క్వార్టర్స్ కార్యాలయం, బరోడా హౌస్, న్యూఢిల్లీ-110001 వారు భారత రాష్ట్రపతి కొరకు మరియు తరపున క్రింద ఐటమ్‌ల సరఫరాకై ఇ-ప్రొక్యూర్‌మెంటు పద్ధతిన టెండర్లు ఆహ్వానిస్తున్నారు.


| క్రమ సంఖ్య | ఇ-టెండరు నెం. | ఐటమ్ యొక్క సంక్షిప్త వివరణ | పరిమాణం | గడువు తేది మరియు సమావేశం |
|---|---|---|---|---|
| 1 | A01P90USFD2020 | ఆర్‌డిఎస్‌ఓ వివరణ ఎమ్& సి/ఎన్‌డిటి/130/2007 (బి-స్కాన్) ఆర్‌ఇవి-III జూలై 2017 డిజిటల్ అల్ట్రాసానిక్ డబుల్ రైలు టెస్టర్ | 11 నెంలు | 10.08.2020 న 11:30 గంటలు |
| 2 | A03P90STM2020 | ఆర్‌డిఎస్‌ఓ వివరణ నెం.టిఎమ్/ఎస్ఎమ్/2 (2007 యొక్క ఆర్‌ఇవి) పట్టా కత్తిరించు వీల అబ్రేసివ్ డిస్క్ | 3297 నెంలు | 10.08.2020 న 11:30 గంటలు |
| 3 | A05P90USFD2020 | యుఎస్‌ఎఫ్‌డి యంత్రపు విడి భాగాలు | 05 ఐటమ్‌లు | 17.08.2020 న 11:30 గంటలు |
| 4 | A06P90TMC2020 | ఆల్టర్‌నేటర్లు | 02 ఐటమ్‌లు | 17.08.2020 న 11:30 గంటలు |

గమనిక :- పై ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండర్ల పూర్తి సమాచారం www.ireps.gov.in వెబ్‌సైటులో లభించును. ఇ-టెండర్లలో పాల్గొనదలచు సంస్థలు పై వెబ్‌సైటులో ఎలక్ట్రానిక్ పద్ధతిన రిజిష్టరు కావలెను. దీనికొరకు వారు IT యాక్టు-2000 పరిధిలో భారత ప్రభుత్వం ద్వారా అనుమతి పొందిన సంస్థల ద్వారా జారీ చేయబడిన క్లాస్-III., డిజిటల్ సర్టిఫికేట్‌ను పొంది ఉండవలెను. ఇ-టెండర్లకు బదులు మ్యాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు.

టెండరు ప్రకటన నెం.219-S/1/TMC/02/2020-21 తేది : 17.07.2020 1593/2020

**వినియోగదారులకు చిరునవ్వుతో సేవలు**


# రైతుభరోసా కేంద్రాలకు శంకుస్థాపన
## ముఖ్య అతిథిగా ఎంపీ, ఎమ్మెల్యే హాజరు



పరవాడ : పరవాడ మండలం పెదముషిడివాడ పంచాయతీ లో నూతనంగా నిర్మించే 21.80 లక్షల విలువ గల రైతు భరోసా కేంద్రం మరియు 17.50 లక్షల విలువ గల వెల్నెస్ కేంద్రం కు మంగళవారం అనకాపల్లి పార్లిమెంట్ సభ్యురాలు బీశెట్టి వెంకట సత్యవతి, పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ చేతులు మీదుగా శంకుస్థాపన చేశారు. తదిన అనంతరం లంకలపాలెం రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి మంజూరుకు స్థలాన్ని పరిశీలించి , తానం గ్రామంలో నూతన రైతు భరోసా కేంద్రం శంకుస్థాపన లో పాల్గన్నారు. అనంతరం భరణికం గ్రామానికి వెళ్లి ప్రమాదకర లుకెమియా బ్లడ్ కాన్సర్ తో బాధపడుతు తమిళనాడు రాష్ట్రంలో వెల్లూరు సి.ఎం.సి ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ సోదరుడు బోండా నాని కుమారుడు ఉద్దేశ్ కుటుంబాన్ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని వైద్యానికి 50,000 అక్షరాలా యాభై వేల రూపాయలు వ్యక్తిగత సహాయం అందించడానికి పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ తన దాతృత్వం చాటుకుని అనకాపల్లి పార్లిమెంట్ సభ్యురాలు బిశెట్టి వెంకట సత్యవతి విష్ణుమూర్తి చేతులమీదుగా ఈ నగదును ఉద్దేస్ వాళ్ళ నాయనమ్మ కు అందించారు, ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు , పరవాడ జడ్పీటీసీ అభ్యర్థి పి. ఎస్ రాజు , జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు ,మండల పార్టీ అధ్యక్షులు సిరిపురపు అప్పలనాయుడు , మండల యూత్ ప్రెసిడెంట్ పేదిశెట్టి శేఖర్, 79వ వార్డు వైసీపీ అభ్యర్థి గుర్రంశ్రీను, 77వ వార్డు వైసీపీ అభ్యర్థి బట్టు సన్యాశిరావు, 85వ వార్డు వైసీపీ అభ్యర్థి ఇల్లపు ప్రసాద్, పల్లా అప్పారావు(కబడ్డీ), ఒమ్మి అర్జున్, కలవల్లిపల్లి సత్యనారాయణ, కిరణ్ చంద్, శ్రీనువాసురావు తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

లంకెలపాలెం : అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు భిసెట్టి సత్యవతి,పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అన్నంరెడ్డి ఆధీప్ రాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొని పరవాడ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం శంకుస్థాపనలు చేశారు. పెదముషిడి వాడ పంచాయతీ లో 21.80 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న రైతు భరోసా కేంద్రం, 17.50 లక్షల రూపాయలతో నిర్మించ నున్న వెల్నెస్ కేంద్రానికి ఎంపీ భిసెట్టి సత్యవతి,ఎమ్మెల్యే అన్నంరెడ్డి ఆధీప్ రాజ్ శంకుస్థాపన చేశారు. లంకెలపాలెం లో రైల్వే అడర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరీక్ష చేశారు. అనంతరం తాణాంగ్రామంలో నూతన రైతు భరోసా కేంద్రానికి శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యులు పయిల శ్రీనివాసరావు, వైసీపీ జెడ్పిటిసి అభ్యర్థి పయిల సన్యాసి రాజు,వైసీపీ జిల్లా కార్యదర్శి చుక్క రాము నాయుడు,మండల వైసీపీ అధ్యక్షుడు సిరిపురపు అప్పలనాయుడు,మండల వైసీపీ యూత్ అధ్యక్షుడు పెడిసెట్టి శేఖర్,స్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.


**రక్షణ మంత్రిత్వ శాఖ**

**నావల్ డాక్‌యార్డు, విశాఖపట్నం**

**(టెలిఫోన్: 0891 2816350, 6366 ఫ్యాక్స్: 0891 2816688)**

**ఇ-టెండర్ నోటీసు**

కోటింగ్ నెం. **ఆర్‌పివైపి/ఓటిఆర్/19-20/262**

1. **ఎన్‌డి(వి) వద్ద ఇసిఇ విభాగం కొరకు సిల్వర్ ప్లేటింగు ప్రక్రియ ట్యాంకుల మరమ్మతు, పునరుద్ధరణ/భర్తీ కొరకు** ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా సీలు చేసిన డిజిటల్ టెండర్లు ఆహ్వానిస్తున్నారు.
2. ఇ-టెండరు డాక్యుమెంట్లు **www.defproc.gov.in** వెబ్‌సైటు నుంచి డౌన్‌లోడ్ చేసుకోగలరు. ఆఫ్‌లైను టెండరు డాక్యుమెంటుతో ధరావత్తు జమ నిమిత్తం **రూ.1,91,800/-** ఏదేని జాతీయ బ్యాంకు నుంచి తీసిన డిమాండు డ్రాఫ్టును జత చేయవలెను.
3. **ప్రి-బిడ్డు సమావేశం: 27 జూలై 2020/1030 గం.లకు ఇసిఇ విభాగము** వద్ద బిడ్డరు తమ ప్రతినిధులను పంపగలరు. ప్రి-బిడ్డు సమావేశమునకు వ్రాతపూర్వకంగా అధికారికంగా ధృవీకరించబడిన ప్రతినిధులు సదరు తేది మరియు సమయయున సమావేశమునకు హాజరుకాగలరు.
4. పేర్కొనబడిన ఐటమ్ యొక్క టెండరింగుకు సంబంధించి ఏవేని సందేహాలున్నచో **MYP-ENCNDV@NAVY.GOV.IN** మెయిల్ చేయగలరు. మరియు సాంకేతిక విషయాలపై సందేహాలున్నచో దయచేసి ఇసిఇ విభాగమును టెలిఫోన్ నెం: 0891-2816516 పై సంప్రదించగలరు.
5. సీలు చేసిన ఆఫ్‌లైను టెండర్లు **"MYP"** లకి మార్క్ చేసిన నేవల్ డాక్‌యార్డు, విశాఖపట్నపు విజయ నగర్ గేటు వద్ద ఉన్న టెండరు బాక్సులో వేయగలరు. లేదా సదరు కార్యాలయానికి **08 ఆగస్టు 2020 (1830 గం.లు)** లోగా చేరేలా రిజిష్టరు పోస్టు ద్వారా పంపగలరు.

**davp 10702/11/0021/2021** **డిజిఎమ్ (ఆర్‌పి)**

# విజయభాను సంపాదకీయం

## బతుకు చిట్కాబండి

20వ శతాబ్దం అనూహ్యమైన మార్పులకు వేదిక. మనిషి బతుకు చిత్రాన్ని మార్చేసిన క్యాన్వాస్. ఆవిష్కరణలు- రణాలు, సౌఖ్యాలు- తారతమ్యాలు, విప్లవాలు-అణచివేతలు... ఇలాంటి ద్వంద్వాలెన్నో ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి చేసిన కాలం. వీటి మధ్య నిలదొక్కుకుంటూనే, పరుగు సాగించేందుకు... వ్యక్తిత్వ వికాసం అనే అస్త్రాన్ని ఎంచుకున్నాడు మనిషి. ప్రతిభ మరింత ప్రస్ఫుటం అయ్యేలా, లౌక్యంతో పనులునెరవేరేలా, అలిసిపోకుండానే పోటీపడేలా...వ్యక్తిత్వ వికాసం ఉపయోగపడింది. నేరుగా 'ఇలా ఉండాలి' అని చెబితే... దాన్నిఅన్వయించుకోవడం కష్టం. ఆ మాటకు రకరకాల సిద్ధాంతాలు, విశ్లేషణలు జోడించడం వల్లే ఈ శాస్త్రం నిలదొక్కుకోగలిగింది. వ్యక్తిత్వ వికాసంలో భాగంగా తరుచూ వినిపించే, ప్రభావం చూపించే కొన్ని సిద్ధాంతాలు, పరిశోధనల సమాహారమే ఈ వ్యాసం....

అనుమానం లేదు... బతుకే ఓ ప్రయోగశాల. పడుతూ లేస్తూ... అనుభవాలు పోగు చేసుకుంటూ ముందుకు సాగిపోతుంటాం. కానీ ప్రతి మనిషీ ప్రతి విషయాన్నీ ట్రయల్ అండ్ ఎర్రర్ మెథడ్‌లో తెలుసుకోవాలంటే నూరేండ్ల జీవితం కూడా సరిపోదు. అందుకే ఒకోసారి సాటి మనుషుల విశ్లేషణల మీద ఆధారపడుతుంటాం. మనకు తోచిన తర్కమేదో వారితో పంచుకుంటాం. సమాజం ఈ స్థాయిలో ఉందంటే కారణం... ఇలా జ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవడమే. అలా పుట్టినవే కొన్ని సిద్ధాంతాలు. సైకాలజిస్టులో, తత్వవేత్తలో, వ్యాపారంలో రాటుదేలి పోయినవారో... ఈ సిద్ధాంతాలను ప్రతిపాదిస్తూ ఉంటారు. వాటిని ఆచరించినవారు ఎంతోకొంత మేలు పొందగానే... అవి విజయసూత్రాలుగా మారిపోతుంటాయి. థియరీలూ, టెక్నిక్‌లూ.... ఇలా వీటిని ఏ పేరుతో అయినా పిలుచుకోండి. ఓసారి ఆచరించి చూడటం మాత్రం మర్చిపోకండి...

నిర్ణయం మార్చుకోవద్దు

మీరెప్పుడైనా గమనించారా... సూపర్‌మార్కెట్‌లోకి అడుగుపెట్టిన తర్వాత తెలియకుండానే బిల్లు బారులు తీరిపోతుంది. అరుదైన వస్తువనో, ఆఫర్‌లో ఉందనో... ఏదో ఒక కారణంతో ట్రాలీకి సరిపడా సామాన్లతో బయటపడతాం. ఇంటికి వచ్చాక సైంటిస్టులాగా బిల్లుని పరిశీలిస్తూ బావురుమంటాం. ఈ ప్రవర్తనకు ఓ కచ్చితమైన కారణం ఉందంటున్నారు నిపుణులు. అదే 'డెసిషన్ ఫెటీగ్' (Decision Fatigue). అంటే నిర్ణయం తీసుకునే దశలో మెదడు అలసిపోవడం. పాపం మెదడు కూడా ఓ అవయవమే కదా.... కాళ్లూ, చేతులలాగానే అది కూడా పనిచేసి చేసి అలసిపోతుంది. సూపర్‌మార్కెట్‌లోకి మీరు అడుగుపెట్టగానే, అక్కడ మీకు సవాలక్ష సామాన్లు స్వాగతం చెబుతాయి. ఒకే తరహా ఉత్పత్తులతో పదుల కంపెనీలు పలకరిస్తాయి. వాటిలో ప్రతిదీ ఏదో ఒక విధంగా ఆకర్షించి మీ నిర్ణయాన్ని ప్రభావితం చేస్తుంటాయి. ఈ అయోమయంలో అనూహ్యమైన ఎంపికకి లోబడతారు. గమనించారో లేదో! షాపింగ్ పూర్తయిపోయి బిల్లింగ్ దగ్గరకు వచ్చాక కూడా... ఆఫర్‌లో ఉన్న వస్తువేదో కౌంటర్ మీద కన్ను కొడుతూ కనిపిస్తుంది. అలసిన మెదడును బుట్టలో వేసుకునేందుకు సిద్ధంగా ఉంటుంది.

ఇది కేవలం సూపర్ మార్కెట్‌కు మాత్రమే పరిమితం కాదు... జీవితంలోని అణువణువునా ఈ నిర్ణయపు నిస్త్రాణం మనల్ని ప్రభావితం చేస్తుంది. ఆఖరికి న్యాయమూర్తులు కూడా అలసిపోయిన కొద్దీ ప్రతికూలమైన తీర్పులు వెలువరిస్తారని తేలింది. తెలివైనవారు సైతం మూర?పు నిర్ణయాలు తీసుకోవడం, పదుల కొద్దీ కథలు వినే ప్రముఖ నటుడు ఓ చెత్త సబ్జక్టును ఎంచుకోవడం... ఇవన్నీ డెసిషన్ ఫెటీగ్ కిందకే వస్తాయి. ఇంతకీ దీనికి ఉపాయం లేదా అంటే లేకేం. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే దీన్ని చాలా తేలికగా అదుపు చేయవచ్చు.

- మెదడు ప్రతి నిర్ణయం కోసమూ ఎంతో కొంత శక్తిని వెచ్చిస్తుందని గుర్తుంచుకోండి. ఏ ప్యాంట్ వేసుకోవాలి, ఏ చానల్ చూడాలి... ఇలా ప్రతి నిర్ణయం వెనకా కొంత మేధోమథనం జరుగుతుంది. కాబట్టి, బాధ్యతలు ఎక్కువగా ఉన్నవారు, సమయం తక్కువగా ఉన్నవారు చిన్నపాటి నిర్ణయాలను త్వరగా తీసుకోవాలి. మీరెప్పుడైనా స్టీవ్‌జాబ్స్, ఐన్‌స్టీన్‌లాంటి వాళ్లు ఎప్పుడూ ఒకేలాంటి బట్టలతో ఎందుకు కనిపించేవారో ఆలోచించారా. దానికి కారణం అశ్రద్ధ కాదు. తెలియకుండానే వాళ్లు తమ నిర్ణయశక్తిని మరింత ముఖ్యమైన విషయాల మీద కేంద్రీకరించడమే!


## రాజీవ్‌గాంధీ హత్య నిందితురాలు ఆత్మహత్యాయత్నం



చెన్నై : మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ హత్య కేసులో నిందితురాలైన నళిని శ్రీహరన్ ఆత్మహత్యాయత్నం చేసింది. తమిళనాడులోని వేలురు జైలులో మంగళవారం ఉదయం ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది.

గమనించిన జైలు సిబ్బంది ఆమెను దవాఖానకు తరలించారు. ఈ విషయాన్ని నళిని లాయర్ పుహళేంది తెలిపారు. బెయిల్ కోసం ప్రయత్నిస్తున్న నళిని ఇటీవల పెరోల్‌పై కుమార్తె హరిత వివాహం కోసం ఆరు నెలలపాటు బయటకు వెళ్లి వచ్చింది. రాజీవ్ హత్య కేసులో దోషిగా తేలిన నళిని 29 ఏళ్లుగా జైలు జీవితం గడుపుతోంది. బెయిల్ కోసం గతకొంత కాలంగా ప్రయత్నాలు చేస్తుంది. రాజీవ్ హత్యకేసులో నళినితో పాటు ఆమె భర్త మురుగన్ సహా ఏడుగురు వేలూరు సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. కాగా తోటి ఖైదీకి, నళికి మధ్య జైలులో గొడవ జరిగిందని, దీంతో ఆ మహిళ విషయాన్ని జైలర్ దృష్టికి తీసుకెళ్లిందని పుహళేంది తెలిపారు. ఆ వెంటనే నళిని ఆత్మహత్యకు యత్నించినట్టు పేర్కొన్నారు. అయితే, గతంలో ఎప్పుడూ నళిని ఇలా చేయలేదని, ఇందుకు గల కారణాలు తెలుసుకుంటామన్నారు. విషయం తెలిసిన నళిని భర్త తనను పిలిచి ఆమెను పుళల్ జైలుకు తరలించేలా చూడాలని కోరారు. ఈ విషయమై త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పుహళేంది తెలిపారు.

## రాష్ట్రపతిని కలిసిన రఘురామకృష్ణరాజు



దిల్లీ: అమరావతిని పరిపాలనా రాజధానిగా కొనసాగించాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కోరినట్టు నరసాపురం వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజు తెలిపారు. రాష్ట్రపతిని కలిసిన అనంతరం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్ లాంటి న్యాయ కోవిదుల సలహా తీసుకుని రాజధాని వికేంద్రీకరణ బిల్లుపై ఏపీ గవర్నర్ నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సూచించాలని రాష్ట్రపతికి వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. పార్లమెంట్‌లో తెలుగు భాషపై మాట్లాడినందుకు తనకు వైకాపా నోటీసు ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. "నా పైన మా ప్రభుత్వానికి కోపం వచ్చింది. నాపై దాడికి మా ప్రభుత్వమే ఉసిగొల్పుతోంది. వైకాపా నేతలు పార్టీకి, ప్రభుత్వానికి తేడాను గమనించడం లేదు. ఎమ్మెల్యేలు, కార్యకర్తల నుంచి ముప్పు ఉందన్న విషయాన్ని రాష్ట్రపతికి తెలిపాను. ప్రజల డబ్బుతో రాజధాని కడుతున్నారు.. ఎవరూ భయపడవద్దు. తప్పు జరిగితే ప్రశ్నించండి. అమరావతి కోసం అందరం కష్టపడదాం. రైతులకు న్యాయం చేద్దాం. కులాలకు అతీతంగా మనం ముందుకు వెళ్ళాలి. రాజధానిలో అన్ని కులాల వారు భూములు ఇచ్చారు. వైసీపీ పార్టీ పై ఎవరైనా బురద జల్లితే తుడిచే పనిలో నేనున్నాను." అని రఘురామకృష్ణరాజు మీడియాతో తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన పూర్తి సమాచారం రాష్ట్రపతి దగ్గర ఉందని, రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని భావిస్తున్నాని ఆయన చెప్పారు. అనంతరం కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తోనూ రఘురామకృష్ణరాజు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తనపై పత్రికల్లో వస్తున్న వార్తలను చూసి బాగోగులు అడిగారని ఎంపీ తెలిపారు. అంతేకాకుండా తన భద్రత అంశంపై మంత్రితో చర్చించానని చెప్పారు. త్వరలో మరికొంత మంది మంత్రులను కూడా కలుస్తానని ఎంపీ పేర్కొన్నారు.

## నటుడు అర్జున్ కుమార్తెకు సోకిన కరోనా

### కుమార్తెతో సహా పలువురికి కోవిడ్



చెన్నై: తెలుగుతో సహా పలు దక్షణ భారతీయ సినిమాలలో నటించిన నటుడు అర్జున్ కుటుంబంలో పలువురికి కరోనా సోకింది. తాజాగా ఆయన కుమార్తె ఐశ్వర్య అర్జున్‌కు కరోనా వైరస్ వ్యాధి సోకినట్టు నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు. "నాకు కొవిడ్-19 వ్యాధి సోకినట్టు ఇటీవలే నిర్ధారణ అయింది. వైద్య నిపుణుల సలహాతో నేను హోం క్వారంటైన్‌లో ఉంటున్నాను. ఇటీవలి కాలంలో నా సమీపంలోకి వచ్చిన వారు దయచేసి జాగ్రత్త వహించాల్సిందిగా కోరుతున్నాను." అని ఆమె ప్రకటించారు. ఇక అర్జున్ మేనల్లుడు ధృవ సర్జా, అయన భార్య ప్రేరణకు కూడా కరోనా సోకినట్టు నిర్ధారణ అయింది. ధృవ, ఇటీవల మృతి చెందిన కన్నడ నటుడు చిరంజీవి సర్జా సోదరుడు. ఈయన, రశ్మిక మందన కలసి నటించిన కన్నడ చిత్రం 'పొగరు' మార్చిలో విడుదల కావాల్సి ఉండగా.. కరోనా ప్రభావంతో వాయిదా పడింది. ఐశ్వర్య ఈ సంగతిని బహిరంగంగా వెల్లడించటం, తోటివారిని జాగ్రత్త పరచటం ద్వారా ఆమె కరోనా వ్యాప్తి నివారణకు తన వంతు బాధ్యత నిర్వర్తించారని పలువురు ప్రశంసించారు. ఐశ్వర్య 'పట్టత్తు యానాయి' అనే చిత్రంతో తమిళంలో అరంగేట్రం చేశారు. కాగా ఆమె చివరిగా 2018లో కన్నడ చిత్రం 'ప్రేమ బరాహ'లో తెరపై కనిపించారు.

ఈ చిత్రానికి అర్జున్ స్వయంగా రచన, దర్శకత్వ బాధ్యతలు చేపట్టడం విశేషం.

## సచిన్‌కు ఊరట శుక్రవారం వరకు చర్యలొద్దు..!

జైపూర్: రాజస్థాన్ మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్‌కు తాత్కాలిక ఊరట కలిగింది. జులై 24 వరకు సచిన్ పైలట్‌తోపాటు కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని రాజస్థాన్ హైకోర్టు స్పీకరుకు సూచించింది. రెబల్ ఎమ్మెల్యేలు వేసిన రిట్‌పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, తీర్పును జులై 24కు వాయిదా వేసింది. స్పీకర్ ఇచ్చిన నోటీసులను సవాలు చేస్తూ కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలు రాజస్థాన్ హైకోర్టుకు వెళ్లిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు తీర్పును శుక్రవారానికి వాయిదా వేసింది. ఇదిలాఉండగా, ఈ సాయంత్రం ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ భేటీ కానుంది. ముఖ్యమంత్రి నివాసంలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశం జరుగనుంది. ఈ ఉదయం ప్రారంభమైన రాజస్థాన్ కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం ముగిసింది.

## కవి సమయం

### 'ప్రేమ'

సృష్టిలో తీయనిది ప్రేమోనోయ్
అనంతమైనది, అద్భుతమైనది ప్రేమ
ప్రపంచం అంతా ప్రేమమయం
సముద్రం నుండి అలలు
చంద్రుని నుండి వెన్నెల
సూర్యుని నుండి కిరణాలు
దైవం నుండి ప్రేమ దివ్యలీల
కర్కశ హృదయాన్ని మార్చే శక్తి
ప్రేమే సృష్టికి మూలం, జీవనాధారం
ప్రేమే ధర్మం, ప్రేమే భాష్యం
ప్రేమే కావ్యం, ప్రేమే సర్వశ్వం
ఎన్నటికీ మారనిది, త్యాగం కలిగి
ప్రతి ఫలాన్ని ఆశించనిది
నిత్యము, సత్యము, శాశ్వతము

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : శ్రావణ; తిథి : విదియ రా.8.24; ఆశ్రేష రా.9.04; ఉ.వ.10.09ల 11.42.

బుధవారం 22-07-2020

**మేషం** : దూర ప్రయాణాలు చేస్తారు. శరీర వత్తిడి, అలసటి ఎక్కువగా ఉంటుంది. స్త్రీలు షాపింగ్ వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మెళుకువ అవసరం. పత్రికా సంస్థలలోని వారికి పనిభారం, విశ్రాంతి లోపం వంటి చికాకులు అధికం. నిర్మాణ పనులలో జాప్యం, అధిక వ్యయం వల్ల ఆందోళనకు గురవుతారు. రావలసిన ధనం వాయిదాపడుట వల్ల ఆందోళనకు గురవుతారు.

**వృషభం** : సమయానికి నిద్రా, భోజనం ఉండదు. దీర్ఘరోగులు మాత్రం జాగ్రత్త అవసరం. నిరుద్యోగులకు ఉపశమనం కలుగుతుంది.

**మిథునం** : తఉద్యోగులకు పై అధికారుల వత్తిడి కలుగుతుంది. దూరపు బంధువులతో ఇష్టాగోష్టి చేస్తాడు. విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**కర్కాటకం** : నూతన వ్యాపారాలు చేయువారి వ్యవహారాలు అనుకూలించును. అవసరాలకు అనుకున్న సమయానికి ధనం చేతికి అందుతుంది. పాత సన్నిహితులను కలుసుకుంటారు. రాజకీయ నాయకులకు అనుకూలం. ఆరోగ్యం బాగుంటుంది.

**సింహం** : ఆర్థిక విషయాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. రుణాలు మంజూరు అగును. బిందువుల కొరకు విలువైన వస్తువులను కొంటారు. సన్నిహితులతో కలిసి విందు, వినోద కార్యకలాపాలు సాగిస్తారు.

**కన్య** : హోటల్, కేటరింగ్ రంగాల్లోవారు పని వారితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఆలయ సందర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. కోర్టు వాదోపవాదాల్లో ప్లీడర్లు విజయం సాధిస్తారు. మీ శ్రీమతి సహాయం లేనిదే మీ సమస్యలు పరిష్కారం కావని గ్రహించండి. ఇతరుల మెప్పుకోసం శ్రమాధిక్యత, ఒత్తిడి ఎదుర్కొనవలసివస్తుంది.

**తుల** : ప్రయాణాల లోనూ, బ్యాంక్ వ్యవహారాలలోను ఇబ్బందులను ఎదుర్కొంటారు. పత్రికా, ప్రైవేటు రంగాల వారికి ఆర్థిక ప్రగతితో కూడిన అవకాశాలు లభిస్తాయి. రావాణా రంగాలలోని వారికి చికాకులుతప్పవు. బంధువుల రాకతో గృహంలో సందడి కాన వస్తుంది. పెట్టుబడుల విషయంలో పునరాలోచన చాలా అవసరం.

**వృశ్చికం** : కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరవుతాయి. మీరు అనుకున్న సాహసో పేతమైన నిర్ణయాలు మంచి ఫలితాలనిస్తాయి. వ్యాపారాల్లో నిలదొక్కుకోవటానికి మరింతగా శ్రమించవలసి ఉంటుంది. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. ప్లీడర్లకు, ప్లీడరు గుమస్తాలకు, వైద్యులకు అను కూలత


**ధనుస్సు** : స్థిరాస్థులు విక్రయించాలనే ఆలోచన విరమించు కోవడం మంచిది. విద్యార్థులకు మిత్రబృందాల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది మెళకువ వహించండి. బ్యాంకు వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మీ కృషికి తగిన ప్రతిఫలం ఉంటుంది. స్త్రీలతో అతిగా సంభాషిం చటం వల్ల అపార్థాలకు గురికావలసి వస్తుంది.

**మకరం** :వృత్తిపరమైన సమా వేశాలకు అనుకూలం. లక్ష్యసాధనకు మీరే చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. న్యాయ, బోధన కళారంగాల వారికి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. దీక్షా పట్టుదలతో అనుకున్న లక్ష్యం సాధిస్తారు. వ్యాపారాల్లో భాగస్వామి సహాయ సమకారం లభిస్తుంది.

**కుంభం** : రాజకీయ, సినీరంగ కళాకారులకు శుభప్రదం. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. దూర ప్రయాణాలకు సంబంధించి ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలంగా వాయిదాపడిన పనులు పూర్తిఅగును. పై అధికారుల మన్నలు పొందుతారు. **మీనం** : శారీరక శ్రమ, అకాల భోజనం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. ప్రియ మైన వ్యక్తులను కలుసుకుంటారు. ఉద్యోగ స్తులకు పెండింగ్ పనులపై దృష్టి సారి స్తారు. ఆలయాలను సందర్శిస్తారు. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనా నిరుత్సా హపరుస్తాయి. ఏ విషయంలోను హామీ ఇవ్వకుండా లౌక్యంగా దాటవేయండి..

# చందన రూపుడు... సింహాచలేశుడు


## సంకీర్తన



దేశంలోని అన్ని నారసింహ క్షేత్రాల్లో విశాఖపట్నం జిల్లాలోని సింహాచలం క్షేత్రం అతి ప్రాచీనమైనది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ విశాఖపట్నం నగరానికి 11 కి.మీల దూరంలో తూర్పు కనుమల్లోని సింహగిరిపై సముద్రమట్టానికి 800 అడుగుల(244మీ)ఎత్తున ప్రశాంత వాతావరణంలో శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయం ఉంది. ఇక్కడ స్వామి స్వయంభువుగా వెలిశారు. సింహాచలం ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రంగా ఉంది. విశాఖ పరిసర ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంత భక్తులంతా సింహాద్రి అప్పన్నగా పిలుచుకునే వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఇక్కడ కొలువై ఉన్నాడు. నిత్యం చందనంతో కప్పబడి కనిపించే ఈ స్వామి నిజరూప దర్శన సమయాన్ని చందన యాత్ర లేదా చందనోత్సవం అని అంటారు. ఇది ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ తదియ (మే నెలలో) వస్తుంది.

ఆలయ చరిత్ర-స్థల పురాణం

స్వయంభూన సింహాచల శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి వారికి ఇక్కడ 11వ శతాబ్దంలో ఆలయాన్ని నిర్మించినట్లు స్థలపురాణం బట్టి తెలుస్తోంది. కళింగ శైలిలో నిర్మించిన ఈ ఆలయం అదుతేమైన శిల్ప కళ, అందమైన గోపురాలతో భక్తులకు కనువిందు చేస్తుంది. ఆలయంలో పలు చారిత్రక సందరాల్లో వేసిన శిలా శాసనాలు చారిత్రక పరిశోధకులను ఆకర్షిస్తాయి. సత్యకాలంలో వేదాలు అపహరించిన హిరణ్యాక్షుడిని సంహరించిన వరాహ అవతారం, ఆ తర్వాత యుగంలో హరి ద్వేషంతో.. భక్తులను హింసించిన హిరణ్యకశిపుని వధించిన నృసింహావతారాల కలయికగా.. స్వామి ఇక్కడ వరాహ నృసింహ స్వామిగా స్వయం వ్యక్తమయ్యారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఇక్కడ రోజూ నాలుగు వేదాలు, నాలాయిర దివ్య ప్రబంధాలు, పురాణాలు స్వామి వారి సన్నిధిలో పారాయణ చేస్తారు. ఇది దక్షిణ భారతదేశంలోని ముఖ్యమైన వైష?వ పుణ్యక్షేత్రాల్లో ఒకటి. తిరుపతి తర్వాత అత్యధిక ఆదాయం (రూ.52 కోట్లు)కలిగిన దేవాలయమిదే. ఏడాది మొత్తంలో 12 గంటలు మాత్రమే దేవుడి నిజరూప దర్శనం భక్తులకు లభిస్తుంది. శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి వారు ఏడాదిలో 364 రోజులు సుగంధ భరిత చంద నంతో కప్పబడి ఉంటారు. భక్తులకు నిత్యం దర్శనం ఇచ్చేది.. ఈ చందన అవతారంలో వుండే స్వామి వారే. ఏటా ఒక్క వైశాఖ శుద్ధ తదియ నాడు మాత్రమే.. అర్థరాత్రి నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం వరకూ ఆ నిజరూప దర్శనం ఉంటుంది. స్వామి వారి నుంచి తొలగించిన గంధాన్ని చందన ప్రసా దంగా భక్తులకు అందజేస్తారు. అలాగే గిరి ప్రదక్షిణ కూడా ఇక్కడ ప్రత్యేకంగా జరిగే ఉత్సవం. మిగతా సమయాల్లోనూ ఎంతో రద్దీగా ఉండే సింహాచలం ఆలయం ఈ రెండు సందరాల్లో ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బంగా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి తరలివచ్చే లక్షల మంది భక్తులతో మరింత రద్దీగా మారుతుంది. ఈ సందర్భంగా ప్రత్యేక ఆర్జిత సేవలు ఉంటాయి. ఆలయంలో కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకొని కోరికలు కోరుకుంటే అవి తీరుతాయనేది భక్తుల విశ్వాసం.





29వ (పాత 20వ) వార్డులో మంగళవారం రామజోగిపేట, అంథోనినగర్ పరిసర ప్రాంతాలలో వార్డు టీడీపీ అభ్యర్థి బొట్ట సన్నమ్మ & అప్పలస్వామి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బొట్ట పరదేశి యాదవ్ పర్యవేక్షణలో శానిటరీ పనులు చేయడం జరిగింది.

# చిన్నారి పట్ల మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

## వైద్యఖర్చులు నిమిత్తం యాభైవేలు అందజేత



పరవాడ: పరవాడ మండలం భరిణికం గ్రామంలో లుకేమియా బ్లడ్ క్యాన్సర్ తో బాధ పడుతున్న బొండా నాని నాలుగేళ్ల కుమారుడు ఉద్దేశ్ కుటుంబాన్ని మంగళవారం ఉదయం అనకాపల్లి ఎంపీ డా.బి.సత్యవతమ్మ, పెందుర్తి ఎమ్మెల్యే అన్నం రెడ్డి అధీప్‌రాజ్ పరామ ర్శించారు. బాలుడు ఆరోగ్య పరిస్థితి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాలుడు వైద్యానికి అవసరమైన సహాయం తప్పకుండా అందిస్తామన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి నుండి, ప్రధాన మంత్రి సహాయనిధి నుండి ఏది అవకాశం ఉంటే ఆ నిధి నుండి బాలుడు వైద్యానికి అవసరమైన నిధులు సమకూరుస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. అనంతరం పెందుర్తి ఎమ్మెల్యే వ్యక్తిగతంగా రూ.50,000 ఉద్దేశ్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ భర్త వివేకానంద ఛారిట బుల్ ట్రస్ట్ ఛైర్మన్ డా.విష్ణుమూర్తి, స్థానిక వైసీపీ నేత మండల వైసిపి యూత్ అధ్యక్షుడు పెద శెట్టి శేఖర్, వైసీపీ సెంట్రల్ కమిటీ సభ్యులు పైల శ్రీనివాసరావు, వైసీపీ జడ్పిటిసి అభ్యర్థి పైల సన్యాసి రాజు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కా రామునాయుడు,దాట్ల గణేష్ రాజు తదితర నాయకులు ఉద్దేశ్ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.

# పేదల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం

## మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసురాజు



కార్యక్రమంలో వైసీపీ నాయకులు గంగూలీ శ్రీను తదితరులు ఉన్నారు.

అచ్యుతాపురం : పేదల సంక్షేమమే ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని వైసిపి నాయకులు, మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసురాజు అన్నారు. మంగళవారం మండలంలో వెదురువాడ గ్రామంలో నూత నంగా మంజూరైన పింఛన్లను ఆయన చేతులు మీదుగా పంపిణీ చేశారు.

ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇచ్చిన మాట ప్రకారమే కాకుండ అదనంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు.

అర్హత ఉన్న వారికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడం తప్ప పార్టీలు, రాజకీయాలు చేయని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అని అన్నారు. ఈ

# పరవాడ జర్నలిస్టులుకు జనసేన చేయూత

## ఎమ్‌యస్‌ఎన్ సొంత నిధులతో నిత్యావసర సరుకులు పంపిణీ



పరవాడ : కరోనా వైరస్ కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరవాడ మండలం లోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు మంగళవారం ఉదయం స్థానిక పైడిమాంబ ఆలయ ప్రాంగణంలో జనసేన పార్టీ నాయకులు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. సుమారు 50 మంది జర్నలిస్టులకు ఐదు కేజీలు నాణ్యమైన బియ్యం, ఆరు రకాల పప్పు దినుసులు, తొమ్మిది రకాల కూరగాయలు తదితర సరుకులతో పాటు శానిటైజర్లను పంపిణీ చేశారు. జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గం సీనియర్ నాయకులు మోటూరు సన్యాసి నాయుడు సొంత నిధులతో సమకూర్చిన సరుకులను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జర్నలిస్టులకు పంపిణీ చేశారు. అనంతరము అయన మాట్లడుతూ జనసేన అద్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు కరోనావంటి విపత్కర సమయంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో చుక్కనాగు(సంజయ్), మోటూరిహరి, రెడ్డి ప్రశాంత్ (పండ), కరెడ్ల అభిరామ్, గుడెసంజీవ్, వడిశలరాము, వడిశల రాజు, గణేష్, సిద్దనాతి కౌసిక్ తదితరులు పాల్గొన్నారు.

# అనాథ బాలల ఆదరణలో వనితా వాకర్స్ క్లబ్ సేవలు మరువనివి

## - ఛైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం



విశాఖపట్నం : విశాఖ నగరంలోని, పేద, అనాథ, వీధి బాలలకు వస్తు రూపేణా, ఆర్థిక సహాయం, ఇతర సేవా కార్యక్రమాలను మురళీనగర్ కు చెందిన వనిత వాకర్స్ క్లబ్ సభ్యులు నిత్యం నిర్వహిస్తూ బాలల ముఖాల్లో చిరు నవ్వులు పూయిస్తుండడం అభినందించదగ్గ విషయమని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం అన్నారు. కరోనా సేవా కార్యక్రమాలులో భాగంగా వనితా వాకర్స్ క్లబ్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మురళీ నగర్ లో మంగళ వారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ పిల్లా అర్జునుడు,చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొండు సీతారాం,క్లబ్ అధ్యక్షురాలు జె. ఉమ, చేతుల మీదుగా నరవ ప్రాంతానికి చెందిన ఆరాధన అనాథ పిల్లల ఆశ్రమ నిర్వాహకుడు విశ్వ సాయి కి నిత్యావసర సరుకులు,వస్త్రాలు, దుప్పట్లు, మాస్కులు, శా నిటైజర్లు అందించారు.అనంతరం 101 గవర్నర్ పిల్లా అర్జునుడు వనితా వాజర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఉమ, మాట్లాడుతూ సీఆర్పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీతారాం సూచన మేరకు నగరంలో ఎన్నో అనాథ,పేద, వీధి బాలల ఆశ్రమాలకు తమ క్లబ్ ఆర్థిక రూపం లోను, వస్తు,ఇతర నిత్యావసరాల రూపంలో లోను అధిక సంఖ్యలో సహాయం చేసామనే సంతృప్తి తమ సభ్యుల హృదయాల్లో గూడు కట్టుకుని ఉందన్నారు,బాలల సేవ బ్రహ్మ దేవుని సేవగా భావిస్తూ, భవిష్యత్ లో నగరంలో మరిన్ని సేవాకార్యక్రమాలు విరివిగా చేసేందుకు తమ క్లబ్ సభ్యులు ప్రణాళికా యుతంగా అడుగులు వేస్తామన్నారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం మాట్లాడుతూ, అనాథ, పేద పిల్లలను ఆదుకోవడానికి నిర్విరామంగా తమ ఫోరం చేపడుతున్న వివిధ కార్యక్రమాలకు మద్దతుగా వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు వేలాది రూపాయల నిధులతో ఎన్నో రకాల నిత్యావసర, అత్యవసర వస్తువులు, సరుకులు వారి చేతుల మీదుగా అందిస్తుం డడం, ఆయా సందర్భాల్లో పిల్లల మధ్య వారి మోముల్లో ఆనందం చూడగలుగు తుండడం చెప్పనలవి కానిదని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యవర్గ సభ్యులు ప్రభా శర్మ,,మహాలక్ష్మి,ఇతర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గజపతినగరంలో జోరుగా నాటుసారా దందా

## పంచాయతీ కార్యదర్శి తనిఖీలలో పట్టుబడ్డ నిల్వ ఉంచిన సారా ప్యాకెట్లు

చోడవరం : మండలంలోని గజపతి నగరం గ్రామంలో నాటుసారా దందా జోరుగా సాగుతోంది. స్థానిక రామాలయం వెనుక పాడుబడ్డ భవనం లో నాటు సారా ప్యాకెట్లు నిల్వ ఉంచిన నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి యశ్వంత్, సచివాలయం మహిళా పోలీస్ గణేష్ మ్మ కు సమాచారం అందడంతో మంగళవారం ఉదయం సంబంధిత ఇంటి వద్ద తనిఖీ చేయడంతో 15 నాటు సారా ప్యాకెట్లు పట్టుబడ్డాయి. దీంతో సంబంధిత ఇంటి యజమాని ఆరా తీసి చోడవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. నాటు సారా విక్రయాలపై పోలీసులు దృష్టిసారించి దర్యాప్తు చేపడు తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటీర్లు కే నానాజీ ఆడారి కోటి ఆదిబాబు, స్థానిక యువత పాల్గొన్నారు. కాగా గ్రామంలో పలుచోట్ల నాటుసారా అమ్మకాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, ఎవరైనా సారాయి విక్రయిస్తే వారిపై న్యాయపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సెక్రెటరీ తెలిపారు.



ఇంటి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి యశ్వంత్, సచివాలయం మహిళా పోలీస్



తనిఖీలలో పట్టుబడ్డ నాటు సారాయి ప్యాకెట్లు

# పైలెట్ ప్రాజెక్టులో 24 నుండి పరిశుభ్రత పక్షోత్సవాలు

## డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్.శిరీషరాణి వెల్లడి



నర్సీపట్నం : పరిశుభ్రత దిశగా పంచాయతీలు నడిపించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన లో భాగంగా ఈ నెల 24 నుండి ఆగస్టు 15 వరకు పరిశుభ్రత పక్షోత్సవాలు నిర్వహించతలపెట్టిందని డివిజనల్ పంచాయతీ అధికారిణి ఆర్ శిరీష అని వెల్లడించారు. మంగళవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ 24వ తేదీ ఉదయం 9 నుండి 12 గంటల వరకు , మధ్యా హ్నం 2 నుంచి 5 గంటల వరకు పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో పరిశుభ్రత పక్షోత్సవాల కార్యక్రమాలపై సమావేశాలు నిర్వహిస్తారన్నారు. 25వ తేదీన యస్ హెచ్ జి ఇద్దరు సభ్యులు, ఇద్దరు త్రాగు నీటి నిర్వహణ కార్యకలాపాలు సభ్యులు, ఇద్దరు మురికి కాలువలో పూడిక తొలగించే సభ్యులు, ఇద్దరు ఎస్ డబ్ల్యూ పిసి సభ్యులు, ఇద్దరు ఆరోగ్యపరమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యక్తులతో కమిటీ ని ఏర్పాటు చేస్తారు . 27వ తేదీన గ్రామాల్లో అపరిశు భ్రంగా ఉన్న ప్రదేశాలు, దోమలు ఉత్పత్తి అయ్యే ప్రాంతాలు, గ్రామంలో నీరు నిల్వ ఉండే ప్రదేశాలు తదితర సమస్యలను గుర్తించేందుకు గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్ల తో కలిసి పాదయాత్ర చేపడతారన్నారు. 28వ తేదీ నుండి 14వ తేదీ వరకు ప్రతిరోజూ.... కనీసం 50 గృహాలు పర్యటన చేసి , ప్రతి ఇంటి యొక్క సమస్యలను గుర్తించి, రికార్డు చేస్తారని ఆమె తెలిపారు. గ్రామ ఇన్చార్జి అధికారి ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవ రోజున శాసనసభ్యులు తదితరులను ఆహ్వానించి పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించా లన్నారు. గ్రామంలో తడిపొడి వ్యర్థాలను గృహ స్థాయిలోని వేరు వేరు చేసి, చెత్తను ఎస్ డబ్ల్యూ పిసి షెడ్లుకి రవాణా చేయడం , వర్మీ కంపోస్ట్ తయారీ, తదితర విషయాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఆమె తెలియజేశారు. డివిజన్ లోని అన్ని మండలాల్లోనూ పైలెట్ ప్రాజెక్టుగా రెండేసి గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. రెండవ దశలో మరి కొన్ని మండలాల్లో నాలుగేసి గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందని ఆమె తెలిపారు.

# పాత్రికేయులను ప్రభుత్వం ఆదుకోవాలని

## - సిఎం కు వ్యవసాయ కార్మిక సంఘం వినతి



దేవరాపల్లి : పాత్రికేయులు సమస్యలు పరిష్కరించాలని, కోవిడ్ 19 కారణంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న జర్నలిస్ట్ లను ప్రభుత్వం ఆదుకోవాలని ఏ పి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి. వెంకన్న కోరారు. ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహనరెడ్డికు మంగళవారం మెయిల్ ద్వారా వినతి పత్రం పంపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతోమట్లాడారు. జర్నలిస్టులకు ఇల్లు స్థలాలు ఇవ్వాలని, ప్రభుత్వం జివోను జారీ చేసిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జివోను అమలు చేయడం కోసం రెవిన్యూ యంత్రాంగం కొన్ని సంవత్సారాలు కాలం తాత్సారం చేయడం సరికాదన్నారు. సమాజంలో నిత్యం సత్యాలును వెలుగులోకి తీసుకు వచ్చి సమాజం పట్ల బాద్యతతో నిరంతరం ప్రజల్లో ఉంటు ప్రాణాలును కూడా లెక్క చేయకుండా బార్య పిల్లలును వదలి నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అటువంటి జర్నలిస్టులకు ఎంతోమందికి నిలువనీడలేని వారు ఎంతోమంది అద్ది కొంపల్లో ఉంటున్నారని పేర్కొన్నారు. కోవిడ్ వచ్చిన తరువాత న్యూస్ కవర్ చేయటంకోసం వెళ్ళి కరోనా బారిన పడి చనిపోతున్నవారు ఉన్నారన్నారు. ఇటువంటి వారికి ప్రభుత్వం ఎటువంటి సహాయం అందివ్వటం లేదని, ప్రభుత్వ ప్రవేశ పెట్టిన నవరత్నల్లోని సంక్షేమ పథ కాలు స్కీముల్లో జర్న లిస్టుల కోసం ప్రత్యేకంగా ఎటువంటి స్కీములు లేవన్నారు. ఇల్లు స్థలాలు కోసం జివోను ఇచ్చిన ఎక్కడ సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి న్యాయమైన కోర్కెలు పరి ష్కారం చేయాలని, జర్నలిస్టులకు ఇల్లు స్థలాలు ఇచ్చి, పక్క ఇల్లు మంజూరు చేయాలని ఆ వినతి పత్రంలో కోరారు. ఆ కాపీలను రాష్ట్ర సమాచార మంత్రికి, జిల్లా కలెక్టర్ కు పంపించామన్నారు.

# యానాంలో 85 కు చేరిన పాజిటివ్ కేసులు

యానాం : నియోజకవర్గ పరిధిలో కరోనా రోజు రోజుకు విజృం భిస్తుంది. మంగళవారం కొత్తగా 18 పాజిటివ్ కేసులు నమోదు కావడంతో మొత్తం కేసుల సంఖ్య 85 కు చేరుకుంది. కొత్త గా నమోదైన కేసులు కనకాలపేట -2, పరంపేట -2 . పిల్లా రాయవీధి-3. అగ్రహారం-1 బెజవాడ వారి వీధి-1. గోపాల్ నగర్ (గాంధీనగర్ )1, యుకెవినగర్-1, దొమ్మేటిపేట-3,హైస్కూల్ లోడ్డు-1, పాంచాలవీధి-2, టీచర్స్ కోలనీ-1 గా ఉన్నాయని అధి కారులు తెలిపారు. రోగుల డిశ్చార్జి పై అస్పష్టత... ఐసోలేషన్నారుల్లో చికిత్స పొందుతున్న పలు వురు ఆరోగ్యవంతంగా డిశ్చార్జి అవుతున్నప్పటికీ సంబంధిత వివ రాలు అధికారులు తెలపక పోవడంతో ఎంతమంది చికిత్స పొందు తున్నారు అనే విషయంలో అస్పష్టత వస్తుందని రికవరీ రేటును ప్రకటించడం ద్వారా ప్రజల్లో మనోధైర్యం కల్పించినట్లవుతుందని పలువురు అంటున్నారు.

# కరోనా వ్యాధి నివారణకు ప్రభుత్వం వైద్యులు ఎప్పుడు మెడికల్ క్యాంపులు పెట్టాలన్న గిరిజన సంఘం కార్యాలయం అందుబాటులో ఉంటుంది

అరకులోయ : అరుకు మండలంలోని కరోనా వ్యాధి నివారణకు గిరిజన సంఘం కార్యకర్తలు సేవలు అందిం చడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని ప్రభుత్వం మా సేవలు వినియోగించుకోవాలని అన్నారు అరకులోయ టౌన్షిప్ పరిధిలోగల కొండ వీధి లో జూలై 15వ తేదీన ఒకరికి కరవ వచ్చినట్లు ప్రభుత్వ వైద్యులు నిర్ధారించారు కరుణా నిర్ధారించిన వ్యక్తిని విశాఖలో ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్నారు దానితో సంభాషించిన కొంతమంది అరకు లోయ వై టి సి కేంద్రంలో 15 మంది క్వారంటైన్ లో ఉన్నారు కరోనా వచ్చిన కొండ వీధి ప్రజలకు సేవలు అందించుటకు ప్రభుత్వ వైద్య శాఖ వారు గిరిజన సంఘం ఆఫీస్ లో నిర్వ హించి ఆదుోవాలని గిరిజన సంఘం ముందుకు వచ్చింది.

# బాలయోగి గురుకులాన్ని కోవిడ్ కేర్ సెంటర్‌కు కేటాయించడం తగదు

**బాలయోగి గురుకుల పాఠశాల ఛైర్మన్ చిట్ల రమణమ్మ ఆధ్వర్యంలో స్కూల్ వద్ద ఆందోళన**




నర్సీపట్నం : కోవిడ్ కేర్ సెంటర్‌గా నర్సీపట్నంలోని బాలయోగి గురుకులం కేటాయించడం తగదని పాఠశాల కమిటీ చైర్మన్ చిట్ల రమణమ్మ అన్నారు. మంగళవారం ఆమె ఆధ్వర్యంలో పలువురు దళిత సంఘాల నాయకులు తో కలిసి పాఠశాల కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్‌డిఓ కె.లక్ష్మి శివజ్యోతి కి వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించగా సిబ్బంది అడ్డుపడ్డారు. ఏవో పరిపాలన అధికారి కూడా దరఖాస్తు తీసుకునే విషయంలో అతి జాగ్రత్త వహించారని ఆమె అన్నారు. ఒక కార్యాలయంలో ఉన్న అధికారులు ఇంత జాగ్రత్త వహిస్తు న్నప్పుడు, 600 మంది దళిత బాలికల పాఠశాల పై తాము ఎంత జాగ్రత్త వహించాలో ప్రజలందరూ గుర్తించాలని కోరారు. బాల యోగి గురుకులం లో కోవిడ్ కేర్ సెంటర్ ను ఎంత మాత్రం పెట్టకండి అని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మార్తి అప్పలరాజు,గాతాడ సహ దేవుడు చిట్ల చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# దేవరాపల్లిలో దుకాణాలు బంద్

**- స్వచ్ఛంద మూసివేతకు వ్యాపారులు నిర్ణయం - కరోనా జాగ్రత్తలపై పోలీసులు ప్రచారం**



దేవరాపల్లి : మండల కేంద్రంలో మరలా లాక్ డౌన్ ఛాయలు కనిపించాయి. దేవరాపల్లితో పాటు పలు గ్రామాల్లో కరోనా పాజిటివ్ కేసులు రోజు రోజుకి పెరగడంతో మండల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికే మండలంలోని కాశీపురం, బి. కింతాడ, కొత్తపెంట, వేచలం గ్రామాల్లో కేసులు నమోదు కాగా బి.కింతాడలో ఇటీవల కరోనా పాజిటివ్ కేసుతో ఒక మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. అదే విధంగా ఆదివారం మండల కేంద్రంలో రెండు కేసులు నమోదు కావడంతో అధికారులు, పోలీసులు, స్థానిక వ్యాపారులు అప్రమత్తంమై మండల కేంద్రంలో మరో 15 రోజులు పాటు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేయడానికి ముందుకు వచ్చారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వ్యాపారాలు తీసుకోని అక్కడ నుంచి పూర్తిగా దుకాణాలు మూసివేస్తామని అధికారులకు తెలపడంతో వారు వ్యాపారులను అభినందించారు. ఈ విషయమై పోలీస్ వాహనంతో గ్రామంలో మైక్ ప్రచారం చేశారు. దీనికి గ్రామస్తులు సహకరించాలని పోలీసులు కోరారు.

# కౌలురైతుల అవగాహన సదస్సు




గొలుగొండ : మంగళవారం గొలుగొండ మండలం ఏఎల్‌పురం గ్రామంలో రైతు భరోసా కేంద్రం నందు పట్టాదారులను, కౌలు రైతు లకు పంట సాగు హక్కు పత్రం (సిసిఆర్‌సి)పై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 20 నుండి వచ్చే నెల 7వ తేదీ వరకు రైతు భరోసా కేంద్రాల వద్ద అవగాహన కల్పించడం జరుగుతుంది. ఎవరైనా కౌలురైతులు ఉన్నట్లు అయితే వీఆర్వోకు ఆధార్ కార్డు, పట్టాదారుని పాస్ బుక్ జెరాక్స్ తీసుకొని వెళ్లినట్లు అయితే విచారణ చేసి పట సాగు హక్కు పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవ కాశాన్ని రైతులు సద్వినియోగం చేసు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి టి.మధుసూధనరావు, వీఆర్వో, ఎఇఒ వివిఎ, పంచాయతీ కార్యదర్శి, కౌలు రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చదువులు

# మీ పిల్లల జీవితానికి వెలుగులు



అచ్యుతాపురం : ప్రభుత్వ పాఠశాలలో చదువులు మీ పిల్లల జీవితానికి వెలుగులని , ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను ఉపయోగించుకుని పిల్లల భవిష్యత్ తీర్చిదిద్దుకోవాలని వక్తలు కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సూచిస్తున్న ఆహ్వాన కరపత్రాలను మంగళవారం మండలంలో కొండకర్ల గ్రామ సచివాలయంలో కార్యదర్శి, సిబ్బందితో కలిసి ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి డి జానకి స్వరూపిణి, ఉపాధ్యాయులు టి ఎ సత్యనారాయణ , ఎమ్ వెంకటప్పారావు, ఎ.విజయ్, కె సోమశేఖర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# నేడు శ్రీ సత్యదేవుని 130వ ఆవిర్భావ దినోత్సవం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నందు శ్రీ స్వామివారి 130వ అవిర్భావ దినోత్సవ మహోత్సవములు నేడు అనగా బుధవారం శ్రీ స్వామివారి "జయంతి మహోత్సవం" శ్రీ స్వామివారి సన్నిధిలో పరిమిత సిబ్బందితో అత్యంత వైభవంగా నిర్వహించుటకు గానూ వైదిక కమిటీ వారు నిర్ణయించడమైనది. కరోనా వైరస్ దృష్ట్యా దేవాదాయ శాఖ కమీషనర్ వారు జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి "శ్రీ సత్యనారాయణ స్వామి వారి జయంతి మహోత్సవము" శ్రీ స్వామివారి సన్నిధిలో అతి కొద్ది మంది అర్చకులు,వేద పండితులు మరియు పరిమిత సిబ్బందితో మాత్రమే శాస్త్రోక్తంగా నిర్వహించుటకు గాను నిర్ణయించడమైనది.

కావున ప్రజాశ్రేయస్సు దృష్ట్యా తీసుకున్న ఈ నిర్ణయానికి భక్తులు, గ్రామస్థులు సహకరించవలసినదిగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు కోరారు.

# చట్ట వ్యతిరేక కక్ష సాధింపు చర్యలు మానుకోండి

**- టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల రాజా**



అన్నవరం/ప్రత్తిపాడు : తూ.గో.జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం నగర పంచాయతీ కి చెందిన ప్రముఖ న్యాయవాది, తెలుగుదేశంపార్టీ జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు పైలా సుభాష్ చంద్రబోస్ పార్టీ జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు పైలా సుభాష్ చంద్రబోస్ ను రాజమండ్రి పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసులో భాగంగా ఎటువంటి ముందస్తు నోటీ సులు ఇవ్వకుండా ప్రత్తిపాడు సర్కిల్ పోలీసులు ఆదివారం అర్ధరాత్రి తలుపులు పగలగొట్టి ఇంటి లోనికి ప్రవేశించి అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ముద్దాయిని అరెస్టు చేసే ముందు సి ఆర్ పి సి సెక్షన్ 41 ఏ ప్రకారం నోటీసు ఇవ్వాలి,కానీ పోలీసులే కోర్టు ఆదేశాలను తుంగలో తొక్కడం చట్ట వ్యతిరేక చర్యని,పోలీసులు పైలా పై ప్రదర్శించిన తీరు కక్ష సాధింపు చర్యలకు నిదర్శనంగా కనపడుతోంది అని...

దానికి సంబంధించిన సంబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ,ఇటువంటివి పునరావృతం అవ్వకుండా చూడాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వరుపుల రాజా అన్నారు.

# ఎడ్లబండ్లతో ఇసుక తరలిస్తున్నారని కార్యాలయానికి తరలింపు



గొలుగొండ : గొలుగొండ మండలం చోద్యం గ్రామం దగ్గర ఇసుకతో ఉన్న ఏడుటైరుబళ్లను ఎద్దులతో సహా ఎక్సైజ్ సిఐ పట్టుకొని గొలుగొండ తహశీల్దార్ కార్యాలయంకు అప్పజెప్పారు. మంగళవారం ఉదయం పట్టుకున్న ఎడ్ల బండ్లను కనీసం మధ్యాహ్నం వరకు కూడా ఉన్నతాధికారులు స్పందించ లేదని ఎడ్లబండి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇసుకను నాటు వాళ్లతో తోలుకోవచ్చని ప్రభుత్వం చెప్పినప్పటికీ స్థానిక అధికారులు మాత్రం చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన చేస్తున్నారు. కనీసం పశువులకు గడ్డి కానీ నీళ్లు కానీ పెట్టలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ బళ్ళు లింగంపేట చోద్యం గ్రామాలకు చెందినవి.

## కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

భీమునిపట్నం : భీమిలి మండలం నారాయణ రాజు పేట పంచాయితీ లో 20 ఏళ్లుగా ఉన్న ఓల్టేజ్ సమస్యను రాష్ట్ర మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస రావు(అవంతి) ఆదేశాల మేరకు రూ.3.90 లక్షలతో పొలాలలో కొత్త ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయటమే కాకుండా ఏడు విద్యుత్ స్థంబాలు వేస్తున్నట్లు చెల్లూరి పైడప్పడు ప్రెస్ మీట్ లో తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాద సూర్యనారాయణ, కరుభుక్త అప్పల నారాయణ, చెల్లూరి నగేష్ బాబు, బోణి బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లోకి ఆహ్వానం

**- ప్రిన్సిపాల్ షోలన్**

యానాం : 2020-21 విద్యాసంవత్సరానికి యానాంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షోలన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ప్రథమ సంవత్సరం లోనికి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత తో సెకండ్ ఇయర్లోనికి చేరబోయే విద్యార్థులు లెటర్ ఎంట్రీ ద్వారా చేర్చుకుంటామని ఆవిధంగా డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ఉన్నాయన్నారు. అభ్యర్థులు ఆన్ లైన్ ద్వారా,కళాశాల వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునుఅన్నారు .

జూలై 21 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చనని తెలిపారు. పూర్తి చేసిన అప్లికేషన్లు ఈ నెల 31 లోగా మొదటి సంవత్సరం అప్లికేషన్లు,ఆగస్టు 8 లోపు సెకండ్ ఇయర్ అప్లికేషన్లు సమర్పించాలని కోరారు. ఇతర వివరాల కొరకు ( 1884-232119 ను సంప్రదించాలన్నారు.

## శరవేగంగా నాడు - నేడు పనులు



అచ్యుతాపురం : మండలంలో చోడపల్లిలో ఎం పి పి పాఠశాలలో నాడు - నేడు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంగళవారం వైసిపి మండల యూత్ అధ్యక్షులు గండిబోయిన వెంకట్ జరగుతున్న నాడు - నేడు పనులు పరిశీలించారు . ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ పాఠశాల పునఃప్రారంభానికి పూర్తి చేయాలనే సంకల్పంతో పాఠశాల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఎన్ నిర్మల, గ్రామ నాయకులు గెద్దాడ మాణిక్యం, అనుసూరి అప్పలరాజు తదితరులు ఉన్నారు.

## సత్యదేవుని 130వ జయంతిని పురస్కరించుకుని

# రిత్విక్‌లకు దీక్ష వస్త్రములు బహూకరణ





అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ స్వామివారి 130వ జయంతి మహోత్సవాల సందర్భంగా మంగళవారం ది. 21.07.2020 తేదీన శ్రీ స్వామివారి అంకురార్పణ అనంతరం పండితులకు, రిత్విక్ లకు దీక్షా వస్త్రములను దేవస్థానం డిప్యూటీ ఈవో ఈరంకి జగన్నాధ రావు చేతుల మీదుగా బహూకరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు ఏఈవో భ్రమరాంబ,సూపరింటెండెంట్లు లక్ష్మణ స్వామి,పెండ్యాల. భాస్కర్ రావు,టెంపుల్ ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ మరియు వేద పండితులు,ఋత్విక్కులు తదితరులు పాల్గొన్నారు.

# ఉదయం 11 గంటలకు షాపులు మూసివేసే విధంగా చూడాలి

## విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐ.పి.ఎస్





విజయనగరం : వ్యాపారవేత్తలు, ప్రజలు విజయనగరం జిల్లాలో స్వచ్ఛందంగా లాక్‌డౌన్ పాటించేందుకు ముందుకు రావడంతో లాక్‌డౌన్ నిబంధనలు పటిష్టంగా అమలయ్యే విధంగా చూడాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐపిఎస్ మంగళవారం ఆదేశించారు. లాక్‌డౌన్ అమలు తీరును పరిశీలించేందుకుగాను జిల్లా ఎస్పీ బి.రాజకుమారి పట్టణంలో పలు ప్రాంతాలను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేసారు. విజయనగరం పట్టణంలోని ఆర్టీసి కాంప్లెక్సు, బాలాజీ జంక్షను, కోట, మూడు లాంతర్లు, గంట స్థంభం, కన్యకాపరమేశ్వరి కోవెల, ఎన్‌సిఎస్, నాయుడు ఫంక్షను హాలు, గూడ్సు షెడ్, బాలాజీ మార్కెట్, కలెక్టరుఆఫీసు జంక్షను ప్రాంతాలను సందర్శించారు. లాక్‌డౌన్ నిబంధనలు అమలులో ఉన్నందున ఉదయం 11 గం॥లకు షాపులు మూసివేసే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులును జిల్లా ఎస్పీ ఆదేశించారు. మద్యం షాపుల వద్ద మద్యం కొనుగోలుదారులు భౌతిక దూరం పాటించేటట్లు, మాస్కులు ధరించే విధంగాను చూడాలన్నారు. ప్రస్తుతం కరోనా వ్యాధి తీవ్రత ఏవిధంగా ఉందో ప్రజలకు వివరించాలన్నారు. కరోనా నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని పనులు, చేయాల్సిన పనులను గురించి తెలిపి, అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ ఒక్కరూ మాస్క్ ధరించేవిధంగా చూడాలని, చేతులను ఎప్పటికప్పుడు సబ్బుతోను లేదా శానిటైజరుతో శుభ్రపర్చుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎవరికైనా కరోనా వ్యాధి లక్షణాలు పొడి దగ్గు, జ్వరం, గొంతునొప్పి, జలుబు వంటి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే కరోనా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షల రిపోర్టులు వచ్చే వరకు గృహ నిర్భందంలోనే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేయకుండా కుటుంబ సభ్యులు, ఇతరులను కలిసేందుకు స్వస్తి పలకాలని జిల్లా ఎస్పీ బి.రాజ కుమారి సూచించారు.

# సింహాచలం ఆలయ ట్రస్ట్ బోర్డులో నూతనంగా మరో ముగ్గురు సభ్యుల నియామకం

విశాఖపట్నం: సింహాచలం ఆలయ ట్రస్ట్ బోర్డులో నూతనంగా ముగ్గురు సభ్యుల నియామకం జరిగింది.ఆ మేరకు ఏపీ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేవీ నాగేశ్వరరావు, పార్వతీదేవి, కే లక్ష్మణకుమార్‌లను ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమించింది.

కాగా.. గతంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్‌గా, మహారాజా అలక్ నారాయణ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్(మాన్సాస్) ట్రస్ట్ చైర్‌పర్సన్‌గా ఆనందగజపతి కుమార్తె సంచయిత గజపతిరాజును నియమిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

# ఆపరేషను ముస్కాన్ టీంను అభినందించిన రాష్ట్ర డీజీపీ




విజయనగరం : ఈ నెల 14 నుండి 20 వరకు జిల్లాలో నిర్వహించిన 'ఆపరేషను ముస్కాన్ కోవిడ్ 19' విజయవంతంగా పూర్తి చేసి, 154 వీధి బాలలలను సంరక్షించినందుకుగాను మరియు సినిమాల్లో నటించాలన్న వ్యామోహంతో ఇల్లు విడిచి పెట్టి బయటకు వచ్చిన బాలికను సకాలంలో స్పందించి, సంరక్షించిన బబ్బిలి సబ్ డివిజను ఆపరేషన్ ముస్కాన్ కోవిడ్ 19 బృందాన్ని రాష్ట్ర డిజిపి శ్రీ గౌతం సవాంగ్, ఐపిఎస్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర డిజిపి నిర్వహించినజూమ్ వీడియో కాన్ఫరెన్సులో బబ్బిలి డిఎస్పీ జె. పాపారావుతో, అమ్మాయి తల్లిదండ్రులతోను రాష్ట్ర డిజిపి శ్రీ గౌతం సవాంగ్ మాట్లాడి, అమ్మాయిని రక్షించిన తీరును అడిగి తెలుసుకొని, డిఎస్పీ పాపారావు బృందాన్ని అభినందించారు. బాడంగి మండలం ముగడ గ్రామానికి చెందిన 17 సం॥ల అమ్మాయి సినిమాల్లో నటించాలన్న వ్యామోహంతో ఈ నెల 14న సాయంత్రం ఇల్లు విడిచి పెట్టి, బబ్బిలి ఆర్టీసి కాంప్లెక్సుకు చేరుకొని, రాత్రి అక్కడనే బస చేసింది. జూలై 15న ఉదయం ఆపరేషన్ ముస్కాన్ కోవిడ్ 19 బృందం వీధి బాలలను సంరక్షించేందుకుగాను దాడులు నిర్వహిస్తూ, ఆర్టీసి కాంప్లెక్సుకు చేరుకోగా, కాంప్లెక్సులో తిరుగుతున్న ఆమెను పోలీసులు గుర్తించి, ఆరా తీయగా, తాను సినిమాల్లో నటించాలన్న ఆసక్తితో ఇంటి నుండి బయటకు వచ్చేసినట్లుగా తెలియపర్చింది. వెంటనే, ఈ విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు తెలిపి, అమ్మాయికి కౌన్సిలింగు నిర్వహించి, ఆమెకు మూడు జతల బట్టలు ఇచ్చి, వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు సకాలంలో స్పందించకపోతే అమ్మాయి జీవితం నాశనమయ్యేదని పోలీసులకు వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మాయిని రక్షించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన డిఎస్పీ జె.పాపారావు, సిఐలు కేశవరావు, ప్రసాదరావు, ఎస్ఐ లోవరాజు మరియు ఇతర పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ బి.రాజకుమారిఅభినందించారు.

# రూ.6,900 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక ఆమోదం

శ్రీకాకుళం : జిల్లాలో వార్షిక రుణ ప్రణాళికను రూ.6,900 కోట్లతో ఆమోదించారు. 2020 - 2021 ఆర్ధిక సంవత్సరానికి నాబార్డు, జిల్లా లీడ్ బ్యాంకు సంయుక్తంగా రుణ ప్రణాళికను రూపొందించారు. ఈ వార్షిక ప్రణాళికను మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ జె నివాస్ ఆవిష్కరించారు. వార్షిక ప్రణాళికతోపాటు యూనియన్ బ్యాంకు అనుబంధ సంస్థలు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రం (ఆర్ సెటి), నైరెడ్ సంస్థల వార్షిక నివేదికలను కూడా జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. వార్షిక రుణ ప్రణాళికలో పంట రుణాలకు రూ.2,960 కోట్లు, ఎం.ఎస్.ఎం.ఇ కి రూ.890 కోట్లు, వ్యవసాయ పెట్టుబడి రుణాలుగా రూ.1214 కోట్లు, ఎక్స్ పోర్ట్ క్రెడిట్ గా కోటి రూపాయలు, ఇతర అంశాలకు రూ.650 కోట్లు కేటాయింపు చేసారు. ప్రాధాన్యత రంగాలకు రూ.5,715 కోట్లు, ప్రాధాన్యతేతర రంగాలకు రూ.1185 కోట్లుగా విభజించారు. గత ఏడాది నిర్దేశించిన రూ.6,874 కోట్ల రుణ లక్ష్యంలో రూ.5,916 కోట్లు రుణాలుగా అందించి లక్ష్యంలో 86 శాతం సాధించడం జరిగింది. ఇందులో ప్రాధాన్యత రంగానికి రూ.,3916 కోట్లు అందించడం జరిగింది. జిల్లా కలెక్టర్ జె నివాస్ మాట్లాడుతూ వీధి బళ్ల వ్యాపారులకు రుణాలను ఆత్మ నిర్భర్ భారత్ క్రింద అందించాలని ఆదేశించారు. జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో ఉన్న బళ్ళ మీద వ్యాపారం చేసే ప్రతి ఒక్కరూ ఇందులో ప్రయోజనం పొందే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మెప్మా పూర్తి స్థాయిలో సర్వే చేపట్టి జాబితాలను రూపొందించాలని ఆదేశించారు. ప్రస్తుత ఏడాది ఆర్ధిక పరిస్థితుల రీత్యా రుణాలను సరళంగా మంజూరు చేయాలని ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా రుణాలు మంజూరు జరగాలని సూచించారు. పి.ఎం కిసాన్ పథకం క్రింద అర్హులైన అందరికీ కిసాన్ క్రెడిట్ కార్డు అందాలని అన్నారు. మత్స్య, పసుసంవర్ధక రంగంలో ఉన్న రైతులకు, కౌలు రైతులకు అందించాలని చెప్పారు. కరోనా సమయంలో ఇతర ప్రాంతాలకు వలసలు వలసలు వెళ్ళిన వారు జిల్లాకు తిరిగి చేరుకుంటున్నారని, ఇప్పటికే అధికారిక గణాంకాల ప్రకారం 60 వేల మంది తిరిగి వచ్చారని నివాస్ వివరించారు. కిసాన్ క్రెడిట్ కార్డులను జారీ చేసే ప్రక్రియలో వారందరిని పరిగణలోకి తీసుకుని అర్హత మేరకు జారీ గరిష్టంగా జారీ చేయాలని ఆదేశించారు. మత్స్య రంగంలో రుణాలు అధికంగా మంజూరు చేయాలని పేర్కొంటూ ఐటిడిఏ ప్రాంతంలో మత్స్యకారులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించాలని చెప్పారు.

కోవిడ్ పరీక్షల సామర్ధ్యం పెంపు : జిల్లాలో కోవిడ్ పరీక్షల సామర్ధ్యం రోజుకు 4 వేలకు పెంపు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఇప్పటి వరకు రోజుకు రెండు వేల పరీక్షల సామర్ధ్యం ఉందని తెలిపారు.

వారం రోజుల్లో సామర్ధ్యం రెట్టింపు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, కరోనా లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరూ ధైర్యంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

లీడ్ బ్యాంకు మేనేజర్ జివిబిడి హరిప్రసాద్ మాట్లాడుతూ ఎస్ హెచ్ జి లకు కోవిడ్ రుణాలుగా రూ.5 వేలు అందించవచ్చని ఆదేశాలు ఉన్నాయన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ క్రింద ఇప్పటి వరకు 2204 మందితో జాబితా అందిందని చెప్పారు.

ఈ సందర్భంగా జూలై మాసాంతానికి పదవీ విరమణ పొందనున్న బ్యాంకర్ల సమావేశం సభ్యులు, నైరెడ్ సంచాలకులు ఎం.కృష్ణమూర్తికి జిల్లా కలెక్టర్ దశ్శాలువతో సత్కరించారు.

జిల్లా బ్యాంకర్ల సమావేశంలో కన్వీనర్ మరియు యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ పి.కృష్ణయ్య, నాబార్డు డిడిఎం మిలింద్ చౌసాల్కర్, ఎస్బీఐ ఆర్ఎం ఏవిఎస్ఎస్ ప్రసాద్, ఆర్సెటి డైరెక్టర్ ఎస్.బి.శ్రీనివాస్, డిసిసిబి సిఇఓ డి.సత్యనారాయణ, ఎపివిబి ఆర్.ఎం మహమ్మద్ రియాజ్, నైరెడ్ డైరెక్టర్ ఎం.కృష్ణ మూర్తి, బ్యాంకు ఆఫ్ బరోడా అధికారి రాజేంద్రప్రసాద్, లీడ్ బ్యాంక్ ఎఫ్.ఎల్.సి కె. గిరిజా శంకర్, వ్యవసాయ శాఖ జెడి కె. శ్రీధర్, పశు సంవర్ధక శాఖ జెడి ఏ.ఈశ్వర రావు, బిసి కార్పొరేషన్ ఇడి జి.రాజారావు, మెప్మా పిడి ఎం.కిరణ్ కుమార్,చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు డా.పద్మ , జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి.గోపాల కృష్ణ, మత్స్యశాఖ ఇన్ ఛార్జ్ జాయింట్ డైరక్టర్ పి.వి.శ్రీనివాస రావు, డిఆర్ డిఏ డిపిఎం కె.రామ్మోహన రావు తదితరులు పాల్గొన్నారు



*పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో పెద్దాపురం శాఖ బ్యాంక్ ఆఫ్ బరోడా వారి పదివేల రూపాయలు ధన సహాయంతో కొనుగోలు చేసిన షూస్ ను పెద్దాపురం పురపాలక పారిశుద్ధ్య కార్మికులకు పెద్దాపురం ఆర్డీవో ఎస్.మల్లిబాబు, బ్యాంకు మేనేజర్ వై. ఉదయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జి.శేఖర్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ డేవిడ్ రాజు,బ్యాంకు సిబ్బంది చలపతి, దిలీప్ సమక్షంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు షూస్ ను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బ్యాంకు ఆఫ్ బరోడా వార్షికోత్సవంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు షూస్ ను అందజేయడం అభినందనీయమని అన్నారు. పారిశుధ్య కార్మికులు ఈ షూస్ ను ధరించి అంటు వ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందాలని తెలిపారు.*

*కాంద్రకోట ప్రాధమిక ఆరోగ్య కేంద్ర పరిధి గ్రామాల్లో 100 మందికి స్వాబ్ పరీక్షలు చేయడమైనది.ఈ సందర్భముగా అర్.డి .ఓ శ్రీ మల్లిబాబు గారు మరియు ఎం.పి.డి.ఓ ఏ.రమణారెడ్డి.పంచాయతీ కార్యదర్శి.రాజంరాజు.వి.అర్.ఓ.లు.మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.హెూమ్ ఐసోలాషన్ లో ఉన్నవారికి మెడికల్ కిట్స్ మరియు.వారు తీసుకోవాల్సిన జాగర్తలకి సంబంధించి కరపత్రాలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు.మండల కేంద్రములో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి హెూమ్ ఐసోలాషన్ లో ఉన్నవారిఆరోగ్య పరిస్థితి ఎప్పటికపుడు తెలుసుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.*



# దాశరథి కృష్ణమాచార్య జయంతి (జూలై 22)



తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాంపాలన మీదికి ఎక్కుపెట్టి మహాకవి దాశరథి కృష్ణమాచార్య . దాశరథి గా ఆయన సుప్రసిద్ధుడు. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకొని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి ప్రాతఃస్మరణీయుడు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గర్వంగా ప్రకటించి ఇప్పటి ఉద్యమానికీ ప్రేరణను అందించిన కవి దాశరథి.

దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22 న వరంగల్జిల్లా చిన్న గూడూరు గ్రామంలో జన్మించాడు. తండ్రి దాశరథి వెంకటాచర్య . వీరి బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలోమెట్రిక్యులేషను, భోపాల్ విశ్వవిద్యాలయం నుండి ఇంటర్మీడియెట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండిఇంగ్లీషు సాహిత్యంలో బి. ఏ చదివారు. సంస్కృతం,ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. చిన్నతనంలోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించారు. ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండి రెండో ప్రపంచయుద్ధం సమయంలో ఆ పార్టీ వైఖరి నచ్చక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చిహైదరాబాదు సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాలుపంచుకున్నాడు.

ఉపాధ్యాయుడిగా, పంచాయితీ ఇన్స్పెక్టరుగా,ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసారు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషి చేసారు. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాసారు.

నిజాం పాలనలో రకరకాల హింసలనుభవిస్తున్న తెలంగాణాను చూసి చలించిపోయారు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించారు.

" రైతుదే తెలంగాణము రైతుదే.ముసలి నక్కకు రాచరికంబు దక్కునే అని గర్జించాడు.

దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది, దిగిపోవోయ్, తెగిపోవోయ్ "

అని నిజామును సూటిగా గద్దిస్తూ రచనలు చేసారు.

ఆంధ్రమహాసభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలు శిక్ష అనుభవించారు.నిజామాబాదు లోని ఇందూరు కోటలో ఆయన్ని మరో 150 మందితో ఖైదు చేసి ఉంచింది, నిజాం ప్రభుత్వం ఆయనతోపాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామికూడా ఉన్నరు. పళ్ళు తోముకోవడానికిచ్చే బొగ్గుతో జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిన్నారు. మంచి ఉపన్యాసకుడు. భావప్రేరిత ప్రసంగాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకరు. 1953లోతెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నిర్మించారు. ఆంధ్రప్రదేశ్‌ఆస్థానకవిగా 1977 ఆగష్టు 15 నుండి 1983 వరకు పనిచేసారు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీబహుమతులు గెల్చుకున్నారు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకున్నారు. మీర్జా గాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి గాలిబ్ గీతాలు పేర అనువదించారు. తల్లి మీద, తల్లి తెలంగాణమీద ఆయన రచించిన పద్యాలు ఇప్పటికీ ఎందరికో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి. 1987 నవంబరు 5 న దాశరథి మరణించారు.

# హైకోర్టు ఏది అడిగినా ఇవ్వండి: కేసీఆర్

హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండటంతో వైరస్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై మంత్రి ఈటల, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. కరోనాపై వాస్తవాలను అఫిడవిట్ రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా కరోనా నివారణపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలను అధికారులు సీఎం వద్ద ప్రస్తావించారు. కోర్టుకు కావాల్సిన సమాచారాన్ని వైద్యాధికారులు అందించాలని సీఎం సూచించారు. హైకోర్టు అడిగిన ప్రతి వివరాన్నీ, చేస్తున్న పనినీ తెలపాలని కోరారు. ఎవరు పడితే వారు హైకోర్టును ఆశ్రయిస్తున్నారని అధికారులు సీఎంతో అన్నారు. ఇప్పటి వరకు హైకోర్టు 87 పిల్స్‌ను స్వీకరించిందని చెప్పారు. నిత్యం కోర్టు విచారణ వల్ల ఇబ్బంది కలుగుతోందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. క్లిష్ట సమయంలో పని వదిలి కోర్టు చుట్టూ తిరగడానికే సమయం కేటాయించాల్సి వస్తోందని అన్నారు.

దీని వల్ల విధులకు పూర్తి న్యాయం చేయలేకపోతున్నామని చెప్పారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కరోనా నియంత్రణ పరిస్థితి మెరుగ్గా ఉందని అధికారులు సీఎం కేసీఆర్‌కు వివరించారు.

రాష్ట్రంలోనే మరణాల సంఖ్య తక్కువగా ఉందని తెలిపారు. వైద్యశాఖ, వైద్యాధికారులు శక్తి వంచన లేకుండా పని చేస్తున్నామని సీఎంకు వివరించారు. ఎంతమందికైనా వైద్యం అందించడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందని చెప్పారు. "ప్రతిరోజూ వేల సంఖ్యలో పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇంత చేసినప్పటికీ హైకోర్టు వ్యాఖ్యలు చేస్తుండటం బాధ కలిగిస్తోంది"అని సీఎం వద్ద వాపోయారు.

# రాష్ట్రం అప్పు లలో ఉన్నప్పుడు కొత్త కార్పొరేషన్ లు ఎందుకు ?

## : రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు డాక్టర్ కె.వి వి వి సత్యానారాయణ



విశాఖపట్నం : ఒకపక్క రుణభారం విపరీతంగా పెరిగిపోతున్న కట్టడి చేయకుండా, ప్రభుత్వం అనవసరంగా 52 కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం వల్ల రాష్ట్రం మీద తీవ్రమైన ఆర్థికభారం ఏర్పడుతుందని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు డాక్టర్ కె వి వి వి సత్యనారాయణ విమర్శించారు. ఇప్పటికీ ఉన్న కార్పొరేషన్లో సరిగ్గా పనిచేయడం లేదని, కొత్తవి ఏర్పాటు చేయడంవల్ల రాజకీయ నిరుద్యోగులకు ఆర్థిక వెసులుబాటు గా మాత్రమే ఉంటాయని ఆయన తెలిపారు.52 కార్పొరేషన్ల చైర్మన్లు మరియు డైరెక్టర్ల జీతభత్యాలు, వసతులు మరియు ఇతర ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వం మీద తీవ్రమైన ఆర్థిక భారాన్ని పెంచుతాయి తప్ప ప్రజలకు ఏమాత్రం మేలు జరగదని ఆయన తెలిపారు.ప్రభుత్వాన్ని ప్రజలు ఎవరూ కూడా కొత్తగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయకపోయినా ప్రభుత్వం తనంతట తానుగా ఈ చర్యకు ఉపక్రమించినదని, భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శిస్తూ ఉందని అన్నారు.

**పెంచిన పెట్రోల్ మరియు డీజిల్ రేట్లు వెంటనే తగ్గించాలి:**

"ప్రజల వెన్నుపోటు పథకాలు" లలో భాగంగా ప్రభుత్వం పెట్రోల్ మరియు డీజిల్ రేట్లు ఈ కరోనా సమయంలో పెంచడాన్ని భారతీయ జనతా పార్టీ వ్యతిరేకిస్తుందనీ తెలిపారు.ఇప్పటికే నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని పెట్రోల్ మరియు డీజిల్ రేట్లు విపరీతంగా పెంచడం వల్ల అవి మరింత ఎగబాకి సామాన్యులకు తీవ్ర ఇబ్బందులను కలగజేస్తాయి అని ఆయన విమర్శించారు.రాష్ట్రంలో వ్యాపారాలు జరగక, ప్రజలు ఉద్యోగాలు పోగొట్టుకొని నిరుద్యోగులుగా మారి రోజు వారి జీవన విధానాన్ని నడపలేక, తీవ్ర ఒడిదుడుకులు అవుతున్న సందర్భంలో ప్రభుత్వం పెట్రోల్ మరియు డీజిల్ రేట్ లను భారీగా పెంచడాన్ని రాష్ట్ర ప్రజలందరూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.వంద రూపాయలు పెట్రోల్ కొనుగోలు చేస్తే ప్రభుత్వానికి 35 రూపాయలు వెళ్తాయని, అలాగే వంద రూపాయల డీజిల్ కొనుగోలు చేస్తే 25 రూపాయలు 31 పైసలు ప్రభుత్వ ఖజానాకు జమ అవుతున్నాయని ఆయన తెలిపారు.మనకంటే పక్కన ఉన్న రాష్ట్రాల్లో డీజిల్ Rs 4 తక్కువగా ఉన్నదని దానివల్ల సరిహద్దులో పెట్రోల్ బంకులు తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. కాబట్టి పెంచిన పెట్రోల్ మరియు డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ



తాడేపల్లి : ఆంధ్రప్రదేశ్ విద్యావిధానంలో సంచలన మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే ఏడాది నుంచి ఎల్‌కేజీ, యూకేజీ విద్య అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పీపీ-1, పీపీ-2గా ప్రీప్రైమరీ విద్యను అమలు చేయాలని చెప్పారు. ప్రీ ప్రైమరీ విద్య కోసం ప్రత్యేక సిలబస్ రూపొందించాలని సూచించారు. మంగళవారం పాఠశాల విద్య, గోరుముద్ద నాణ్యతపై సీఎం వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విద్యావ్యవస్థలో ఇటీవల తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు సహా నాణ్యమైన విద్యకోసం తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. మానవవనరుల సమర్థ వినియోగం, ఉత్తమమైన బోధన తదితర అంశాలపై కూడా చర్చ సాగింది. అనంతరం ఆ దిశగా సీఎం జగన్.. మరి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం స్కూలు పిల్లలకోసం రూపొందించిన పాఠ్యపుస్తకాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. స్కూళ్ల పక్కనే అంగన్‌వాడీ కేంద్రాలు ఉంటే బాగుంటుందని అధికారులు ఈ సందర్భంగా ప్రతిపాదించగా.. అందుకు సీఎం వైఎస్ జగన్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో 55వేల అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని సీఎం తెలిపారు. అందులో దాదాపు 35వేల కేంద్రాలకు భవనాలు లేవని అన్నారు. ప్రైమరీ స్కూళ్ల కు సమీపంలోనే అంగన్‌వాడీలు ఉండాలంటే.. ముందుగా ఆయా స్కూళ్లలో తగిన స్థలాలు ఉన్నాయా లేవాఅన్నదాన్ని పరిశీలించి నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

**పకడ్బందీ పాఠ్యప్రణాళికలు ఉండాలి..**

అలాగే పీపీ-1, పీపీ-2 క్లాసులను కూడా ప్రాథమిక విద్య పరిధిలోకి తీసుకురావడంపై ఈ సమావేశంలో చర్చించారు. పీపీ-1, పీపీ-2 పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే దిశగా చర్యలుండాలని సీఎం తెలిపారు. వీరికి పకడ్బందీ పాఠ్యప్రణాళిక ఉండాలని ఆదేశించారు. ఒకటో తరగతి నుంచి బోధించే పాఠ్యాంశాలతో, పీపీ-1, పీపీ-2 పాఠ్యాంశాల మధ్య సినర్జీ ఉండాలని సూచించారు.

**జూనియర్ కాలేజీల స్థితిగతులపైనా చర్చ..**

ఈ సమావేశంలో రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల స్థితిగతులపైనా కూడా చర్చ సాగింది. 270 మండలాల్లో జూనియర్ కాలేజీలు లేవని అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. ప్రతి మండలానికో హైస్కూల్‌ను జూనియర్ కాలేజీగా మార్చేలా తీసుకున్న నిర్ణయం ద్వారా ఈ సమస్యను అధిగమిస్తామని తెలిపారు. అలాగే ప్రస్తుతం ఉన్న జూనియర్ కాలేజీల్లో ఖాళీను భర్తీ చేయడంపైనా దృష్టిపెట్టాలని ఆదేశించారు. పోటీ పరీక్షలకు అవసరమైన విధంగా విద్యార్థులకు బోధన అందించాలని సూచించారు. జాతీయ స్థాయిలో ఐఐటీ, జేఈఈ లాంటి పోటీ పరీక్షలకు వారిని సిద్ధం చేసే దిశగా కార్యాచరణ ఉండాలన్నారు. మరోవైపు ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో టీచర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఒక భనం ఉండేలా చూసుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమంలో కూడా సరైన పాఠ్యప్రణాళికను అనుసరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

అనంతరం మంత్రి సురేష్ మాట్లాడుతూ.. 'ప్రీప్రైమరీ విద్యను బలోపేతం చేసేందుకు అవసరమైన టీచర్లను నియమించాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. సెప్టెంబర్ 5 నుంచి పాఠశాలలు తెరిచేందుకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. దీనిపై అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్ పై ఈ సమావేశంలో చర్చించాం. కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రతీ నియోజకవర్గానికి ఓ విద్యాశాఖ అధికారిని తీసుకోస్తాం. జిల్లా స్థాయిలో డీఇవో, జేడీలు ఉంటారు. జిల్లాల్లో జేసీల పరిధిలోకి విద్యాశాఖను తెస్తాం. పాఠశాలల్లో 8వ తరగతి నుంచే కంప్యూటర్ విద్యను అందిస్తాం. ప్రతి జిల్లాలో టీచర్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నాం. అలాగే వర్చువల్ కాస్ల్ రూమ్, ఇంగ్లిష్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తాం' అని తెలిపారు.

## నేడు 'జగనన్న పచ్చతోరణం'
## 20 కోట్ల మొక్కలే లక్ష్యం



కృష్ణా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇబ్రహీంపట్నంలో బుధవారం 'జగనన్న పచ్చతోరణం' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పేర్నినాని, వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వసంత కృష్ణ ప్రసాద్, జోగి రమేష్ తదితరులు కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం పర్యవేక్షించారు. అనంతరం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ రేపు ఇబ్రహీంపట్నంలో మొక్కలు నాటి వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. 35 లక్షల మందికి ఇవ్వబోయే ఇళ్ల పట్టాల లే అవుట్లలో 'జగనన్న పచ్చతోరణం' కార్యక్రమం కింద మొక్కలు నాటుతున్నామని మంత్రి తెలిపారు. అంతేగాక ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 20 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రతి మొక్కకు ట్రీ గార్డు ఏర్పాటు చేసి 80 శాతం మొక్కలు కాపాడే బాధ్యత గ్రామ సర్పంచ్‌లకు ఇచ్చామని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.

## దర్శనాలకు ఆటంకం ఉండదు
### వైవీ సుబ్బారెడ్డి

తాడేపల్లి : టీటీడీలో భక్తుల దర్శనాలకు ఆటంకం ఉండదని టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన భక్తుల ద్వారా కరోనా వ్యాప్తి చెందడం లేదని నిర్ధారణకు వచ్చామన్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న భక్తులకు దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు. "తిరుపతిలో లాక్‌డౌన్ నేపథ్యంలో స్థానిక బుకింగ్ నిలిపివేశాం. కంటైన్‌మెంట్ జోన్లలో ఉండేవారు తిరుమల రావద్దు. అర్చకులు, ఉద్యోగులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని" ఆయన వెల్లడించారు. భక్తుల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు.

## కరోనా నియంత్రణకు సింగరేణి చర్యలు

హైదరాబాద్: కరోనా వైరస్ నియంత్రణ, చికిత్సలకు సింగరేణి చర్యలు చేపట్టింది. సీఈఆర్ క్లబ్బులు, పాఠశాలలను క్వారంటైన్ కేంద్రాలుగా ఉపయోగించాలని నిర్ణయించింది. ఏరియా ఆస్పత్రుల్లో ప్రత్యేక కరోనా ఐసీయూ వార్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.హైదరాబాద్‌లోని 3 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులతో అంగీకారం కుదుర్చుకున్నట్లు సింగరేణి యాజమాన్యం తెలిపింది.. వైద్య సిబ్బందికి రూ.50 లక్షల బీమా, బేసిక్‌పై 10 శాతం అలెవెన్సులు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కరోనా కేసులు పెరిగిన నేపథ్యంలో కొన్నాళ్లు గనులు మూసివేయాలని సింగరేణి నిర్ణయించింది. కార్మిక సంఘాల గేట్ మీటింగ్‌లకు 2 నెలలపాటు అనుమతి లేదని చెప్పింది. కరోనా సోకిన వారికి ప్రత్యేక క్వారంటైన్ సెలవులు ఇవ్వాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది.

## రాష్ట్రంలో మళ్లీ అనాగరిక పాలన: చంద్రబాబు

అమరావతి: అధికార పార్టీ నాయకుల ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నందుకే ఎస్సీ యువకుడిని చిత్రహింసలకు గురి చేశారని తెదేపా అధినేత చంద్రబాబు, ఆ పార్టీ నేత లోకేశ్ విమర్శించారు.

పోలీస్‌స్టేషన్‌లోనే యువకుడికి శిరోముండనం చేయించడం ఘోరమని వారు మండిపడ్డారు. రాష్ట్రంలో మళ్లీ అనాగరిక పాలన వచ్చిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీలపై జగన్ ప్రభుత్వ దమనకాండ కొనసాగుతోందన్నారు.

వైద్యులు సుధాకర్, అనితారాణితోపాటు, న్యాయమూర్తి రామకృష్ణపైనా భౌతిక దాడులకు పాల్పడినట్లు చంద్రబాబు గుర్తు చేశారు.

# టీడీపీ బీసీ నేతకు అవమానం

**- అత్తిలి అప్పారావు మృతిని పట్టించుకోని టీడీపీ పెద్దలు - సంతాప సందేశానికీ నోచుకోని సీనియర్ నేత**
**- భగ్గుమంటున్న పాత తరం నేతలు**



విశాఖ సిటీ : ఆయన టీడీపీలో సీనియర్ నాయకుడు. పార్టీ ఆవిర్భావం నుంచీ టీడీపీనే నమ్ముకొన్నాడు. ఎన్నో ఎన్నికల్లో పార్టీ కోసం ,నాయకుల గెలుపు కోసం పని చేసాడు. టీడీపీ పాత తరం నాయకుల్లోఆయన ప్రముఖుడు. అటువంటి వ్యక్తి చనిపోతే సంతాప సభ ను ఏర్పాటు చేయకపోగా కనీసం సంతాపం వ్యక్తం చేస్తూ ప్రెస్ నోట్ కూడా రిలీజ్ చేసే తీరిక టీడీపీ నేతలకు లేకపోవడం పట్ల ఆ పార్టీలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బీసీల పార్టీగా చెప్పుకునే తెలుగుదేశం పార్టీలో బిసిలకు ఇస్తున్న ప్రాధాన్యత ఏ పాటిదో ఈ సంఘటన తో తేలిపోయిందని ఆ పార్టీ సీనియర్ నేతలు వాపోతున్నారు. సుదీర్ఘ కాలం పార్టీకి సేవలు అందించి ఇటీవల కన్నుమూసిన ఆ పార్టీ సీనియర్ నేత బీసీ నాయకుడు అత్తిలి అప్పారావును ఆ పార్టీ నగర నాయకులు విస్మరించడం విచారకరం. నిత్యం పార్టీ కార్యాలయంలో ఏదో ఒక కార్యక్రమం నిర్వహించే పార్టీ అర్బన్ అధ్యక్షుడు వాసుపల్లి గణేష్ కుమార్ సంతాప సభ ను ఏర్పాటు చేయకపోగా కనీసం సంతాపం వ్యక్తం చేస్తూ ప్రెస్ నోట్ కూడా రిలీజ్ చేసే తీరిక లేకపోవడం గమనార్హం.తెలుగుదేశం పార్టీ అంటే ఒక కుటుంబం అనే నానుడి కొంత మందికేనా అని పార్టీలో బీసీ నేతలు, ఆయన సహచరులు ఆవేదనతో రగిలిపోతున్నారు.అత్తిలి అప్పారావు మృతి చెందిన విషయం పార్టీ శ్రేణులకు సైతం సమాచారం ఇవ్వలేదని ఇటువంటి పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదని పలువురు సీనియర్లు వాపోయారు. నందమూరి తారకరామారావు పై అభిమానం , తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు పట్ల ఆకర్షితులై 1983లో తెలుగుదేశం పార్టీలో చేరిన అత్తిలి అప్పారావు చివరి వరకు టిడిపిలోనే కొనసాగారు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ తో పాటు పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తో కల్సి పని చేసిన నేతల్లో అప్పారావు ఒకరు . క్షేత్ర స్థాయిలో పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నింపేవారు.

పార్టీ కి తొలి నుంచి సేవలు అందిస్తున్న బీసీ నేతల్లో అత్తిలి అప్పారావు ఒకరు . పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు . గంగవరం గ్రామం తరలింపు సమయంలో మత్స్యకారులు తరుపున నిలబడి వారికి న్యాయం చేయడంలో చిత్తశుద్ధితో పోరాటం చేశారు . బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశారు . అటువంటి నాయకుడు కి పార్టీలో తీరని అవమానం జరిగిందని పాతతరం నాయకులు భగ్గుమంటున్నారు.

ఈ సంఘటనతో పాత తరం నేతలకు పార్టీలో విలువ లేదని తేట తెల్లమైనదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాబలం వున్నా నేతలను విస్మరిస్తూ పేపర్ టీజర్లకు,మైక్ ల ముందు షో చేసే వారికే పార్టీలో విలువను ఇస్తున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కి తొలి నుంచి బీసీలు అండగా వుంటూ వస్తున్నారు. అటువంటి బీసీలను పట్టనట్టు వ్యవహరించడం పట్ల బిసి నేతలు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి పరిణామాలు మంచివి కావని వారు హెచ్చరిస్తున్నారు. పార్టీని నమ్ముకొని తొలి నుంచి భుజాన జెండా మోసిన బీసీ నేతకు ఇచ్చిన గౌరవం ఇదేనా అని పలువురు వాపోతున్నారు.

# అమర్‌నాథ్ యాత్ర రద్దు



దిల్లీ: ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్రను రద్దు చేస్తున్నట్లు అమర్‌నాథ్ దేవస్థానం బోర్డు ప్రకటించింది. దేశంలో కరోనా వైరస్ విజృంభణ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ జీసీ ముర్మూ నేతృత్వంలో మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అమర్‌నాథ్ యాత్ర నిర్వహించడడం శ్రేయస్కరం కాదని, అందుకే ఈ ఏడాది యాత్రను రద్దు చేస్తున్నామని సమావేశం అనంతరం అమర్‌నాథ్ బోర్డు ప్రకటించింది. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం వర్చువల్ దర్శన సదుపాయాన్ని మాత్రం యథాతథంగా కొనసాగిస్తామని వెల్లడించింది.

పరిమిత సంఖ్య లో భక్తులను అనుమతిస్తూ ఈ యాత్ర నిర్వహించాలని తొలుత భావించినా.. చివరికి రద్దు చేయడం గమనార్హం. గతేడాది ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో అమర్‌నాథ్ యాత్ర సగంలోనే నిలిచిపోయిన సంగతి తెలిసిందే.

## టీ20 ప్రపంచకప్‌లో డివిలియర్స్!
### ఫిట్‌గా ఉంటే తీసుకుంటామన్న టీం కెప్టెన్



దిల్లీ: ఆస్ట్రేలియాలో వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్‌లో ఏబీ డివిలియర్స్‌ను తీసుకుంటామని దక్షిణాఫ్రికా జట్టు కెప్టెన్ క్వింటన్ డికాక్ స్పష్టం చేశాడు. దీంతో 360 డిగ్రీ ఆటగాడి పునరాగమనంపై సందిగ్ధత వీడింది. 2018లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఏబీడీ టీ20 ప్రపంచ కప్‌లో ఆడేందుకు ఆసక్తి కనబరిచాడు. అయితే ఈ ఏడాది అక్టోబర్‌లో జరగాల్సిన ప్రపంచకప్ కరోనా కారణంగా వచ్చే ఏడాది అక్టోబర్-నవంబర్‌లో జరుపనున్న విషయం తెలిసిందే. 'టీ20 ప్రపంచకప్ జట్టు ఎంపికలో డివిలియర్స్ మా ప్రతిపాదనల్లో ఉంటాడు. అతడు ఫిట్‌గా ఉంటే కచ్చితంగా తీసుకుంటాం. ఏ జట్టయినా డివిలియర్స్ లాంటి ఆటగాడిని తీసుకోడానికి ఇష్టపడుతుంది. టీ20 ప్రపంచకప్ ఎప్పుడు జరగబోతోందో వేచి చూడాలి' అని క్రికెట్ కనెక్టెడ్ కార్యక్రమంలో డికాక్ వెల్లడించాడు. ఈ ఏడాది జనవరిలోనే దక్షిణాఫ్రికా క్రికెట్ అసోసియేషన్ డుప్లెసిస్‌ను తొలగించి డికాక్‌ను టీ20 జట్టు కెప్టెన్‌గా ఎన్నుకుంది. ఆ దేశ క్రికెట్ డైరెక్టర్ గ్రేమ్ స్మిత్ వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్‌ను టెస్ట్ కెప్టెన్సీకి ఎన్నుకోలేమని ఏప్రిల్‌లో ప్రకటించాడు. అధిక ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుందని టెస్టు సారథిగా ఉండేందుకు డికాక్ సైతం సుముఖత చూపలేదు.

## దుబాయ్‌లోనే ఐపీఎల్-2020
### స్పష్టం చేసిన ఐపీఎల్ ఛైర్మన్ బ్రిజేష్ పటేల్ !

ఇంటర్‌నెట్ డెస్క్: క్రికెట్ అభిమానులకు మరో శుభవార్త! ఐపీఎల్-2020 ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందో స్పష్టత లభించినట్టే. అక్టోబర్-నవంబర్‌లో దుబాయ్ వేదికగా పొట్టి క్రికెట్ వేడుక నిర్వహిస్తామని ఐపీఎల్ ఛైర్మన్ బ్రిజేష్ పటేల్ అన్నట్టు తెలిసింది. పూర్తి లీగు జరుగుతుందని, 60 మ్యాచులు ఉంటాయని సమాచారం.

ఐసీసీ టీ20 ప్రపంచకప్ వాయిదా పడటంతో ఐపీఎల్‌కు మార్గం సుగమమైంది. కరోనా వైరస్ కారణంగా మార్చిలో జరగాల్సిన టోర్నీ నిరవధికంగా వాయిదాపడిన సంగతి తెలిసిందే. అయితే ఆసియాకప్, ప్రపంచకప్ వాయిదాతో అక్టోబర్‌లో నిర్వహించేందుకు అవకాశం బీసీసీఐకి లభించింది. మొదట భారత్‌లోనే నిర్వహించాలని భావించినా పరిస్థితులు మెరుగయ్యేలా కనిపించడం లేదు. అందుకని భారతీయులు టీవీల్లో చూసేందుకు వీలుగా దుబాయ్‌కు టోర్నీని తరలిస్తున్నారు.

'వారం పది రోజుల్లో ఐపీఎల్ పాలక మండలి సమావేశం అవుతుంది. పూర్తి షెడ్యూలుపై నిర్ణయం తీసుకోనుంది. ఇప్పుడు 60 మ్యాచులతో యూఏఈలో పూర్తి స్థాయిలో ఐపీఎల్ నిర్వహించడంపై దృష్టిసారిస్తాం' అని బ్రిజేష్ పటేల్ అన్నారని తెలిసింది. ఇక విదేశీ ఆటగాళ్లు నేరుగా దుబాయ్‌కే వస్తారని సమాచారం.

'మన ఆటగాళ్లకు కనీసం మూడు నుంచి నాలుగు వారాల శిక్షణ అవసరం. బీసీసీఐ తేదీలు ప్రకటించగానే మా ప్రణాళికలపై నిర్ణయం తీసుకుంటాం' అని ఆయన పేర్కొన్నారు. కాగా యూఏఈలో నిర్వహణపై ఐపీఎల్ పాలక మండలి అధికారిక సమాచారం వస్తే పూర్తి స్పష్టత వస్తుంది.

### ఇంగ్లీష్ పరిజ్ఞానంపై
## టోఫెల్ తరహాలో పరీక్ష

తాడేపల్లి: పాఠశాల విద్య, గోరుముద్ద కార్యక్రమాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్షలో అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు. 'కిండర్ గార్డెన్‌పై ప్రత్యేక దృష్టి సాధించాలి. పాఠశాల విద్య పరిధిలోకి పీపీ-1, పీపీ-2లను తేవాలి. స్కూళ్ల పక్కనే అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఐఐటీ, జేఈఈ లాంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వాలి. ప్రతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో టీచర్ల కోసం శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పాఠశాలల విద్యార్థుల్లో ఇంగ్లీష్ పరిజ్ఞానంపై టోఫెల్ తరహాలో పరీక్ష నిర్వహించాలి. లెర్న్ టు లెర్న్ కాన్సెప్ట్‌కు హైస్కూల్లోనే నాంది పడాలి.

డిజిటల్ విద్య, డివైజ్‌లపై అవగాహనకు తరగతులు ఉండాలి. హైస్కూల్లో లైఫ్ స్కిల్స్, కెరీర్ కౌన్సెలింగ్ ఇవ్వాలి. మధ్యాహ్న భోజనంలో నాణ్యత, స్కూళ్లలో బాత్‌రూమ్‌ల శుభ్రతకు ప్రాధాన్యంత కల్పించాలి.

గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బందిని సంపూర్ణంగా వినియోగించుకునేందుకు బలమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com